V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
18-07-2024

సంపుటి : 01 | సంచిక : 75 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD






# కళల కాణాచి తెలంగాణ

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**విశ్వంభరా, హైదరాబాద్ :** తెలంగాణ కళలకు కాణాచిగా ఉందని, జానపద కళలు, శాస్త్రీయ కళలు,సంగీతం, నృత్యం హైదరాబాద్ దక్కనీ కళారూపాలు ఎన్నో తెలంగాణ లో విలసిల్లుతు న్నాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతీలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ నాట్యకారిణి, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్.పద్మజా రెడ్డి ప్రదర్శించిన కాకతీయం 3 వ భాగం నృత్య రూపక కార్యక్రమానికి మంత్రి జూపల్లి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... కాకతీయులు ఎన్నో సాహిత్య, సాంస్కృతిక, కళా రూపాలను, కళాకారులను పోషించారని, అందులో పేరిణి నాట్యం కూడా ఒకటన్నారు. ఆ క్రమంలోనే డాక్టర్.పద్మజా రెడ్డి కాకతీయ వైభవాన్ని, కాకతీయుల ఔన్నత్యాన్ని చాటే విధంగా "కాకతీయం " అనే నృత్య రూపకాన్ని నాటక రూపంలో కాకతీయ కాలంలో రుద్రమదేవి, ఇతర చక్రవర్తులు ఆనాటి కళా సంప్రదాయాలు, రీతులు అన్నీ ఈ నాట్య రూపకంలో అద్భుతంగా కళ్లకు కట్టినట్టుగా చూపించారన, కలలును సజీవంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళలు,సంస్కృతి, సాహిత్యం లో అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, కళాకారును ప్రొత్సహిస్తుందని అని తెలిపారు. అందులో భాగంగానే ఇటీవలే పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి 25 లక్షల చొప్పున నగదు బహుమతిని ప్రభుత్వ పరంగా అందజేశామని వెల్లడించారు. అలాగే రాబోయే రోజుల్లో తెలంగాణలో ఉండే అన్ని రకాల జానపద, గిరిజన,శాస్త్రీయ కళాకారులకి ప్రోత్సాహం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు

# ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- టీజేయూ జిల్లా అధ్యక్షులు ఎండీ షానూర్ బాబా



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల కోసం 'తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ఆధ్వర్యంలో డాక్టర్ సుమంత్ కంటి హాస్పిటల్ సహకారంతో ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షానూర్ మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఏదైనా కంటి సమస్యలు ఉన్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 1000 గంటల నుంచి మధ్యాహ్నం100 గంటల వరకు, విజయ్ భార్గవ్ హాస్పటల్ పక్కన, మీనా నగర్, భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రషీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టి కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారుడు వేముల నరేష్ కన్నుమూత



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ కళాకారుడు, అరుణోదయ సాంస్కృతిక సంస్థ మాజీ నాయకుడు వేముల నరేష్మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోన్న ఆయన హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కన్ను మూశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో వేదికలపై తన పాటలతో ప్రజలను చైతన్య పరిచాడు. ఆయన మృతి పట్ల తోటి కళాకారులు, అభిమానులు నివాళులర్పించారు.






# అజిత్ పవార్‌కు షాక్.. పార్టీకి నలుగురు కీలక నేతల రాజీనామా

**మహారాష్ట్ర:** ఎన్‌సీపీ అధినేత అజిత్ పవార్‌కు షాక్ తగిలింది. మహారాష్ట్రలోని పింప్రి చించ్వాడ్ ప్రాంతానికి చెందిన నలుగురు కీలక నేతలు ఎన్‌సీపీకి రాజీనామా చేశారు. వీరంతా శరద్ పవార్ ఎన్‌సీపీలో చేరే అవకాశాలున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో అజిత్ పార్టీకి ఫలితాలు రాకపోవడంతో ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. గత ఏడాది అజిత్ పవార్ ఎన్‌సీపీని చీల్చి ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షంగా చేరి దాదాపు 40మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎమ్మెల్సీలను తన వెంట తీసుకెళ్లారు. కానీ ఇప్పుడు లోక్‌సభ ఫలితాల తర్వాత సీన్ రివర్స్ అవుతున్నట్లు కనిపిస్తోంది. పింప్రి చించ్వాడ్ ప్రాంతానికి చెందిన కీలక నేతలు పార్టీని వీడారు. ఆ ప్రాంతంలో పార్టీ యూనిట్ చీఫ్ అజిత్ గవ్హనే కూడా వారిలో ఉన్నారు. మిగతా ముగ్గురు.. యశ్ సానె, రాహుల్ భోంస్లే, పంకజ్ భాలేకర్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వారంతా శరద్ వర్గంలో చేరతారని ఊహాగానాలు. పార్టీని బలహీనపరచాలని చూసిన వారిని తమతో చేర్చుకోమని కొద్దిరోజుల క్రితం శరద్ పవార్ స్పష్టం చేశారు.



# కమల కుమారి సేలు వెలకట్టలేవనివి

## డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** కాంగ్రెస్ పార్టీ మాజీ పిసిసి సభ్యురాలు కర్రెద్దుల కమల కుమారి కాంగ్రెస్ పార్టీకి 30 సంవత్సరాల పాటు ఎన్నో సేవలందించారని, ఆమె సేవలు వెలకట్టలేనివని భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు, రోటరీక్లబ్ 3150 డిస్ట్రిక్ మాజీ గవర్నర్(202324) డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని గాంధీభవన్(ఇందిరాభవన్ హాల్)లో జరిగిన కమల కుమారి వర్ధంతి వేడుకలో డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు కర్రెద్దుల కమల కుమారి వారి కుటుంబం కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలందించారని, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అన్నారు. మాజీ ఎంపిగా భద్రాచలం ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేశారని అన్నారు.




# ఉత్తమ వార్త చిత్రం పోటీల

## గోడ పత్రికను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం ఏటా నిర్వహించే రాష్ట్రవ్యాప్త ఉత్తమ వార్త చిత్రం పోటీల గోడ పత్రికను హైదరాబాద్‌లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బట్టి మాట్లాడుతూ న్యూస్ ఫోటో కాంటెస్ట్‌లో పాల్గొనడం వలన పత్రిక ఫోటోగ్రాఫర్‌లకు, ముఖ్యంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి మరియు న్యూస్ ఫోటోగ్రఫీ సంఘంలో గుర్తింపు పొందాలని చూస్తున్న వారికి అనేక ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. న్యూస్ ఫోటో పోటీలో పాల్గొనడం అనేది తమ నైపుణ్యాలు మరియు సృజనాత్మకతను మెరుగుపరచడానికి. ఇతర ప్రతిభావంతులైన పత్రిక ఫోటోగ్రాఫర్‌లతో పోటీ పడడం వలన కొత్త టెక్నిక్‌లను ప్రయత్నించడానికి, విభిన్న శైలులతో ప్రయోగాలు చేయడానికి మరియు కొత్త సవాళ్లను స్వీకరించడానికి ప్రేరేపిస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి మాట్లాడుతూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఏటా ఆగష్టు నెలలో గత 30 సంవత్సరాల నుండి ఫోటోజర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్త ఉత్తమ వార్త చిత్రం పోటీలను నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 200 మంది ఫోటోజర్నలిస్టులు ఈ పోటీలలో పాల్గొంటారని, 2024 2025 సంవత్సరం ఉత్తమ వార్త చిత్రం పోటీల విజేతలకు ప్రథమ బహుమతి రూ.10.000 / , ద్వితీయ బహుమతి రూ.8.000 /, త్రితీయ బహుమతి రూ. 5.000 / లతోపాటు రూ. 2.000 / 25 కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని, అలాగే వీటితోపాటు సర్టిఫికెట్ మరియు మెమెంటో లను కూడా అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల ఫోటోజర్నలిస్టులు పోటీలలో పాల్గొనడానికి మూడు 8 x 12 సైజు కలర్ లేదా బ్లాక్ & వైట్ ఫోటోలను టి.ఎస్.పి.జె.ఏ కార్యాలయం, టియుడబ్ల్యూజె బిల్డింగ్, దేశోద్ధారక భవన్, బషీర్ బాగ్, హైదరాబాద్ కు పంపగలరు. ఆఖరు తేదీ ఆగష్టు 10 , 2024 ఈ కార్యక్రమంలో టి.ఎస్.పి.జె.ఏ రాష్ట్ర నేతలు నగర గోపాల్, అలీముద్దీన్, హరి ప్రేమ్, ఆనంద్ ధర్మాన, వి. రజనీకాంత్, సుమన్ రెడ్డి, శివ కుమార్, అశోకుడు తదితరులు పాల్గొన్నారు



www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
18-07-2024
సంపుటి : 01 | సంచిక : 75 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# 4 గంటలకు రూ.లక్ష
## రైతుల ఖాతాల్లో జమ కానున్న పైకం

రుణమాఫీ మూడు విడతల్లో చేయనున్నట్టు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నేటి సాయంత్రం 4గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తున్నామని తెలిపారు. బుధవారం ప్రజా భవన్ లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి సాయంత్రం 4గంటలకు రూ. లక్ష వరకు ఉన్న రుణాలు, నెలాఖరులోగా రూ. లక్షన్నర వరకు ఉన్న రుణాలు, ఆగస్టు లో రూ.2లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు.

- మూడు విడతల్లో రైతులకు రుణమాఫీ
- ఈ నెలాఖరులోగా రూ.లక్షన్నర..
- ఆగస్టులో రూ.2లక్షల వరకు రుణమాఫీ
- గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం
- నా జీవితంలో గుర్తుండిపోయే రోజు ఇదే..
- తెలంగాణ రుణమాఫీపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి
- ప్రజా భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**విశ్వంభర, హైదరాబాద్:** ఇచ్చిన మాటకు కట్టుబడి ఆనాడు సోనియమ్మ తెలంగాణ ఇచ్చారు. పార్టీకి నష్టమని తెలిసి కూడా సోనియా గాంధీ ఆనాడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు రేవంత్. 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారన్నా రు. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పామన్నారు. ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారన్నారు. "కానీ గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం. రైతు రుణమాఫీ చేస్తామని

మిగతా5లో...

# ఉస్మానియాలో విజయవంతంగా కాలేయ మార్పిడి చికిత్స

- తల్లి కాలేయాన్ని కుమారునికి అమర్చిన వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యుత్తమ ఆరోగ్య సేవలు



**విశ్వంభరా హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందుతున్నాయి. ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో ఇప్పటికే ఎనిమిదిమంది చిన్నారులతో పాటు 30 మందికి కాలేయ మార్పిడి చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు.

మిగతా5లో...

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్‌గా మారనుందా?
## హరీష్ రావు సంకేతాలిస్తున్నారా?

- పార్టీ కండువ మారడం వెనక మతలాడు ఏంటీ?
- చర్చనీయాంశంగా మారిన కండువ మార్పు




# మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- సీఎం, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపిన శారద




# బీజేపీ అధ్యక్షుడిగా ఈటల!
## రేసులో ముందున్నది ఆయనే మరి



- అందేకే ప్రభుత్వంపై దూకుడు
- బీసీ కావడం ప్లస్ పాయింట్
- త్వరల్ అధికారిక ప్రకటన?

**ఇవిశ్వంభర, హైదరాబాద్:** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ త్వరలోనే తెలంగాణ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారా...అంటే అవుననే అంటున్నారు ఆ పార్టీ నేతలు.. బీఆర్ఎస్ లో సుదీర్ఘ కాలం ఉండటమే కాదు మంత్రిగా కూడా పనిచేసిన ఆయనకు రాష్ట్ర స్థితిగతులపై, రాజకీయ పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. తన నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలోనైనా

మిగతా5లో...

# మహారాష్ట్ర-చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కాల్పుల మోత
## 12 మంది మావోయిస్టుల హతం

- వందోలిలో నక్సల్స్ ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాల కూంబింగ్
- ఆరు గంటలకు పైగా ఇరు పక్షాల మధ్య భీకర కాల్పులు
- మృతుల్లో ఇద్దరు తెలుగు వాళ్లు!



**గడ్చిరోలి:** మహారాష్ట్రలోని గడ్చిరోలిలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మహారాష్ట్రచత్తీస్ గఢ్ సరిహద్దుల్లోని వందోలి అటవీప్రాంతంలో ఈ ఎన్ కౌంటర్

మిగతా5లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

# భట్టి తీవ్ర అసంతృప్తి

- పని చేస్తున్నా గుర్తింపు ఏది..?
- కాంగ్రెస్ కీలక నాయకులతో భట్టి తన ఆవేదన



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సంక్షేమ పథకాలు

మిగతా5లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 105 | ₹ 127 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 184 | ₹ 210 |



# ప్రపంచ మానవ హక్కుల పోరాటయోధుడు

## నల్లజాతి సూర్యుడు నెల్సన్ మండేలా జీవితం స్మరణీయం



It is easy to breakdown and destroy the real hero are those who make peace and build.......

> అని ప్రపంచానికి చైతన్యపు స్ఫూర్తిని నింపుతూ వెలుగులు పంచే ప్రగతి పథాలోచనలతో కూడిన మాటలను చెప్పింది ఎవరో కాదు ఆ యోధుడు నల్లజాతి సూర్యుడు , ప్రపంచశాంతి పోరాట యోధుడు "నెల్సన్ మండేలా" అని సగర్వంగా ఈ తరానికి చాటి చెప్పాల్సిన సందర్భం మిది.
> ఆయన మాటల్లో చెప్పాలంటే "ఒక వ్యవస్థను పనిచేయకుండా స్తంభింప చేయడం, నిర్వీర్యం చేయడం , కుప్పకూల్చడం ,ధ్వంసం చేయడం, సులభమే కానీ నిజమైన నాయకులు విధ్వంసాన్ని యుద్ధాలను నష్టాలను కోరుకోరు. సామాజిక ప్రగతిని, ప్రపంచ శాంతిని మాత్రమే కోరుకుంటారని స్పష్టం చేసి ఆయన జీవిత కాలమంతా తాను చెప్పిన మాటలకే కట్టుబడి ఉండి అందుకోసం కృషి చేసిన యోధుడు "నెల్సన్ మండేలా"

జూలై 18 నాటికి నెల్సన్ మండేలా జన్మించి 106 సంవత్సరాలు. ఆయన సౌత్ ఆఫ్రికాలోని కేఫ్ ప్రోవిన్స్ (rollheecape province) లో గల ఉంటాటాలోని మివ్ జో (mvezo)లో జన్మించారు. వాస్తవానికి ఆయన తల్లిదండ్రులు ఆయనకు రోల్హీ లాహ్ లా (rolihlahla) గా నామకరణ చేసినప్పటికీ దక్షిణాఫ్రికా అంతటా 20వ శతాబ్ద కాలంలో పాఠశాలలలో విద్యార్థులకు ఇంగ్లీష్ వారి పేర్లు పెట్టడం జరుగుతుంది. ఆ క్రమంలోనే రోల్హీ లాహ్ లా పేరును నెల్సన్ గా వాళ్ళ ఉపాధ్యాయుడు పెట్టడం జరిగింది.

నెల్సన్ మండేలా చిన్నతనంలోనే ఆయన 12వ ఏటా తన తండ్రి ఊపిరితిత్తుల వ్యాధితో మరణించడం ఆయనను దుఃఖంలో ముంచేసింది. అయినప్పటికీ తండ్రి మరణం ఆయనను నిస్సత్వపు లోను చేయలేదు. గుండె నిబ్బరం పెంచుకున్నాడు. బాల్యం నుండి సమాజంను అధ్యయనం చేశాడు. జాతి వివక్షతతో మృత్యువాత పడుతున్న, మానసికంగా కృంగిపోతున్న, ప్రగతివైపు పయనించలేకపోతున్న వారి నెంధరినో చూసాడు. సామాజికంగా, ఆర్థికంగా ఎదగలేని పరిస్థితులకు కారణాలను అధ్యయనం చేశాడు. అసమానతల పట్ల ఆగ్రహం పెంచుకున్నాడు.

నెల్సన్ మండేలాకు సమాజాన్ని మార్చాలనే కసితోపాటు, విద్యాయొక్క ప్రాధాన్యత, గొప్పతనం గురించి తెలుసు కాబట్టి పట్టుదలతో అనేక కష్టాలు కడగండ్లు అవరోధాలను దాటుకుంటూ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫోర్ట్ హేర్ మరియు యూనివర్సిటీ ఆఫ్ విట్వాటర్‌రాండ్ లోను విద్యనభ్యసించారు. తన లా కోర్సును పూర్తి చేశాడు. మండేలా 1940 సంవత్సరంలో ఒకసారి యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఆయనను యూనివర్సిటీ నుండి తొలగించారు. వలస పాలనకు వ్యతిరేకంగా, జాతి వివక్షతకు వ్యతిరేకంగా, విద్యార్థుల పోరాటం అందరిని ఆలోచింపజేసింది. ఆ సందర్భంలోనే "ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్" కమిటీ నాయకులతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటున్న యువ నేతలతో మండేలకు పరిచయాలు ఏర్పడడం జరిగింది. అన్ని రకాల వృత్తులలో మండేలా తాను కోరుకున్న న్యాయవిద్య(LLB)ను 1943లో పూర్తి చేశాడు .

నెల్సన్ మండేలా న్యాయ శాస్త్రంలో మానవజాతి ప్రగతి కొరకు సమాజంలో శాంతి నేలకొల్పుటకు, మానవ హక్కులను, స్వేచ్ఛను రక్షించుటకు, జాతి వివక్షతను ఎదుర్కొనడానికి, కావలసిన అన్ని అంశాలను చట్టాలను రూల్స్ ను ఉపయోగించి దేశ స్వాతంత్ర్యం కోసం, వలస పాలనకు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడ్డాడు, పోరాడాడు. మండేలాను ఈ ప్రపంచం మానవ హాక్కుల సంరక్షణ కోసం పోరాడిన "గ్లోబల్ అడ్వకేట్"గా గుర్తించడం జరిగింది. మండేలా జీవితంలో బాల్యం నుండి లా గ్రాడ్యుయేట్ వరకు ఒక పేద విద్యార్థిగానే జీవితం సాగినప్పటికీ ఈ ప్రపంచంలో ప్రజల కొరకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నేతగా కీర్తి ప్రతిష్టలు పొందిన యోధుడిగా తన జీవిత పాఠం మనకు స్ఫూర్తి నింపుతుంది.

ఒక నాయకుడు గాని, పోరాట సంస్థ గాని ఎలాంటి నిర్బంధాలు లేనప్పుడు కార్యక్రమాలను నిరాటంకంగా నిర్వహించవచ్చు. కానీ పోరాట సంస్థ మీద పాలకులు నిర్బంధం విధిస్తే ప్రజాబాహుల్యంలో పోరాట కార్యక్రమాలు నిర్వహించలేరు. చట్టాలే ప్రజల హక్కులను హరించినప్పుడు, ప్రజల జీవితాల మీద నిర్బంధాలను కొనసాగించినప్పుడు ఆయా దేశాల్లోని ప్రజలెవరు ఆ చట్టాల పరిధిలో పనిచేయలేరు. ఆ చట్టాలను గౌరవించలేరు. ఆ చట్టాలకు అతీతమైన చట్టాలకు వెలుపల ఉండి కార్యక్రమాలను నిర్వహించాలని నెల్సన్ మండేలా తన "ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్" కమిటీకి చెప్పడం జరిగింది. 1960 సంవత్సరంలో దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్ నేషనల్ కమిటీ మీద నిషేధం పెట్టినప్పుడు అందరూ పోరాట నాయకులు అంతా అండర్ గ్రౌండ్ కార్యక్రమాలు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు నెల్సన్ మండేలా "ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్" మిలిటరీ వింగ్ ను సమర్థించడం దేశాన్ని రక్షించుకునే పోరాట కార్యక్రమాలను ధైర్యంగా కొనసాగించడం ఆయన నిబద్ధతను పట్టుదలను తెలియజేస్తుంది. నెల్సన్ మండేలా అజ్ఞాతంలో కూలి వేషంలో వంటగల్లా వేషంలో రకరకాల రూపాల్లో కార్యక్రమాల్లో పాల్గొని పోరాటంలో ఉన్న వాళ్ళకు నిరుత్సాహం దరిచేరకుండా ధైర్యాన్ని నింపాడు.

నెల్సన్ మండేలా ఆగస్టు 5, 1962 సంవత్సరంలో అరెస్ట్ అయినాడు. అతన్ని 1990 సంవత్సరం వరకు దాదాపు 3 దశాబ్దాలు జైల్లోనే తన జీవితాన్ని నిర్బంధించినప్పటికీ చెక్కుచెదరని గుండె ధైర్యం, నిబ్బరంతో గడిపాడు. ఎలాంటి వసతులు లేని జైల్లో తాను తన దేశం కోసం, ప్రజల హక్కుల సాధన కోసం, ఈ జైల్లోనైనా మరణించడానికి సిద్ధమేనని ప్రకటించిన గొప్ప యోధుడు. చెరసాలలు, ఉరికొయ్యలు, మండే సూర్యులను, ఆపగలవా? అన్నట్లుగా 1990 లో జైలు నుండి విడుదల అయిన మండేలా తన దేశంలో శాంతిని నెలకొల్పటానికి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగెందుకు. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఎన్నుకోవటానికి, జాతి వివక్షతను రూపుమాపడానికి, కృషి చేశాడు. అంతే కాదు ప్రపంచ మంతటా మానవ హక్కులు పరిరక్షించబడాలని, ప్రపంచ శాంతి నిర్మించబడాలని, శాంతి కొరకు కృషిచేసిన ప్రపంచ శాంతి పోరాట యోధుడు నెల్సన్ మండేలా.

నెల్సన్ మండేలాను 1993 సంవత్సరంలో "నోబుల్ పీస్ ప్రైజ్" తో సత్కరించి గౌరవించడం జరిగింది. దీని ద్వారా ప్రపంచంలో ఈతరం ప్రజానీకం, పార్టీలకు, ప్రాంతాలకు, జాతులకు, మతాలకు, అతీతంగా ఈ భూమ్మీద "మానవజాతి తల ఎత్తుకొని" స్వేచ్ఛగా మానవ హక్కులతో సగౌరవంగా ప్రపంచ శాంతి పరిఢవిల్లె సమాజంలో బ్రతకడానికి కావాల్సిన పోరాటాలను నెల్సన్ మండేలా అందించిన స్ఫూర్తితో నిర్వహించాలి. ఇదొక్కటే మన ముందున్న ఎజెండా అని . ఈ లక్ష్యాన్ని సాధించడానికి ముఖ్యంగా విద్యార్థి, యువత దేశభక్తితో ముందుకు రావాలని కోరుకుందాం. నెల్సన్ మండేలా ఆదర్శ జీవితం అందించిన పాఠాలను చదువుతూ ముందుకు సాగుదాం. అప్పుడే ఆయనకు నిజమైన నివాళి నెల్సన్ మండేలా 106వ జయంతి సందర్భంగా

- కె వి ఎల్
రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి
అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం.
9490952649



# పౌరసేవాపత్రం అనుసరించి ప్రభుత్వ శాఖలు, పారదర్శకంగా ప్రజలకు సేవలందించాలి

అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు, దరఖాస్తులను, స్వీకరించే క్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఇన్వార్డు రిజిష్టరులో నమోదు చేయాలి. ఇన్వార్డు రిజిష్టరులో నమోదు చేసిన దానిని అనుసరించి, పౌరసేవ పత్రం ప్రకారంగా "ఫస్ట్ కమ్ ఫస్ట్" (మొదటగా వచ్చినవి మొదటగా) విధానంలో పనులను పూర్తి చేయాలి. ప్రతి ఫిర్యాదుకు, వినతులకు, దరఖాస్తులకు ప్రత్యేక క్రమ సంఖ్యను జారీ చేయాలి. దరఖాస్తు ఇచ్చిన సమయంలోనే అట్టి పని పూర్తియ్యే కాల వ్యవధిని తెలియజేయాలి. ఇచ్చిన గడువులోపల అట్టి పనులను పూర్తి చేయాలి. జాప్యం నిర్లక్ష్యం లేకుండా జవాబుదారీతనంతో, పారదర్శకంగా, బాధ్యతతో ఉద్యోగులు పనిచేయాలి. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలలో పలుకుబడి ఉన్నవారికి, రాజకీయ నాయకులకు, లంచం ఇచ్చినవారికి మాత్రమే పనులు జరుగుతున్నాయేది జనం అనుకుంటున్న వాస్తవం.

సామాన్యులు పనుల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగిన పనులు కావడం లేదు. వారి పనులు నెలల తరబడి పెండింగ్లోనే ఉంటున్నాయి. దీని విషయంలో పనుల కోసం దరఖాస్తు చేసుకొనే సమయంలోనే అట్టి పని జరగడానికి అవసరం పడే అన్ని పత్రములను జత పరిచినారా? లేదా? అనే విషయాన్ని, విధాన పరంగా అన్ని అర్హతలు ఉన్నాయా? లేదా? అని నిర్ధారించుకొని అట్టి దరఖాస్తులను స్వీకరించాలి. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తుల విషయంలో దరఖాస్తు దారులకు, ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించే విధంగా సిబ్బంది సహకరించాలి. ప్రత్యేకంగా ఒకరిని నియమించాలి. సిబ్బంది సంయమనం పాటించాలి. ప్రజలకు అర్థం అయ్యేలా వివరించి చెప్పాలి. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, వివిధ సంక్షేమ పథకాలు పొందడానికి ఉండాల్సిన అర్హతల గురించి, నియమ నిబంధనల గురించి, వాటిని పొందే విధానం గురించి ప్రత్యేకంగా తెలియజేయడానికి దరఖాస్తుల స్వీకరణకు ప్రతి ప్రభుత్వ శాఖలో ప్రత్యేకంగా ఒకరిని కేటాయించాలి. దరఖాస్తులు స్వీకరించే వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. సామాన్యులకు విధానం తెలియక దరఖాస్తు చేసుకొని కాలంతో పాటు, డబ్బులను వృథా చేసుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయి. పైరవీకారులు లేనిదే. లంచం ఇవ్వనిదే పనులు కావు అనే నిందను ప్రభుత్వాలు తొలగించుకోవాలి. నిబంధనలు అనుసరించి అర్హత గలవారికి పనులు, ఎంపికలు సకాలములో జరుగుతాయనే నమ్మకం ప్రజలకు కలిగే విధంగా ప్రభుత్వ శాఖలు, ఉద్యోగులు పనిచేయాలి.

పైసా ఖర్చు లేకుండా ప్రజలు ప్రభుత్వ కార్యాలయానికి వచ్చి ఇన్వార్డులో దరఖాస్తును అందజేసిన పక్షంలో నిర్ణీత గడువులోగా పని పూర్తయి, సంబంధిత వ్యక్తులకు సమాచారం అందే విధంగా ప్రస్తుత వ్యవస్థను సమర్థవంతంగా పని చేయించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. ప్రభుత్వ శాఖలలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సిబ్బందిపై భారం పడడం, పనులకు అధిక సమయం తీసుకోవడం జరుగుతుండడం వల్ల పైరవీకారులు, పలుకుబడి ఉన్న వ్యక్తులు, రాజకీయ నాయకులు చెప్పిన వారికి మాత్రమే పనులు జరుగుతుండడం వల్ల లంచం ఇవ్వనిదే, రాజకీయ నాయకులు చెప్పనిదే పనులు కావు అనే నిర్ధారణకు ప్రజలు వస్తున్నారు . దీనిని మార్చడానికి ప్రభుత్వ శాఖలలో ఉన్న అన్ని ఖాళీలను వీలైనంత త్వరగా భర్తీ చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ముందు వచ్చిన వారికి ముందు పనిచేయడం వల్ల ప్రజలందరికీ మేలు జరుగుతుంది. "సర్వీస్ యాక్టు"ను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని వీలైనంత త్వరగా సర్వీస్ యాక్టును అమలులోకి తేవాలి. ప్రజాపాలన, సుపరిపాలన ఫలాలు ప్రజలందరికీ అందుతాయి. డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా, రాజకీయ వత్తిడిలకు తలొగ్గకుండా, విధాన పరంగా నిబంధనలను అనుసరించి చట్టాలను అనుసరించి, వరుస క్రమంలో పనిచేసే విధానం అమలు చేయడం వల్ల అవినీతి తగ్గును, జవాబుదారీతనం పెరుగును. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెరుగుతుంది. ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది.ప్రగతి సాధ్యం అవుతుంది. ఈ దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



-డా|| యర్రమాద కృష్ణారెడ్డి
వ్యవస్థాపకులు-సమాచార హక్కు
వికాస సమితి,
సెల్: 99496 49766

# గత 10 ఏండ్లల్లో నల్లగొండ జిల్లా అభివృద్ధి

గత తెలంగాణ ప్రభుత్వం 2014 నుండి నేటి వరకు నల్లగొండ జిల్లా అభివృద్ధి పథంలో ఎలా దూసుకుపోతుందో ఇప్పుడు తెలుసుకుందాం. 2014కు ముందు తెలంగాణ ప్రాంతంలో 9 జిల్లాలు వెనుకబడ్డ జిల్లాలుగా గుర్తిస్తే అత్యధికంగా వెనుకబాటుకు గురైన జిల్లా నల్లగొండ జిల్లా. అనేక వనరులు ఉన్నపటికీ ఆనాటి నాయకులు నల్లగొండ జిల్లాను కనీసం పట్టించుకున పరిస్థితిలేదు. హైదరాబాద్ మహానగరానికి చేరువలో ఉండే జిల్లాగా ,ఆంధ్ర తెలంగాణ ప్రాంతానికి ఒక వారదిగా ఉన్న జిల్లా ఐనప్పటికీ కూడా అభివృద్ధి అనే పదానికి ఆమడ దూరంగా ఉండేది . ఫ్లోరోసిస్ , ఆర్సెనిక్ కలుషితాల వలన ప్రజలు తీవ్రంగా నష్టపోయినారు . పరిశ్రమలు పెట్టడానికి అనువైన భూములు ఉన్నపటికీ ఇక్కడి ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేయలేదు . ఎస్ ఎల్ బి సి , పోతిరెడ్డి పాడు , లాంటి ప్రోజెక్టుల వలన నల్లగొండ జిల్లా కు తీవ్రమైన అన్యాయం జరిగింది . కృష్ణ నది పరివాహక ప్రాంతమైనప్పటికీ అభివృద్ధిని నోచుకోలేదు. యాదగిరిగుట్ట , మట్టపల్లి , లింగమతుల జాతర లాంటి దివ్యమైన పుణ్యక్షేత్రాలు ఉన్నపటికీ తీవ్రమైన వివక్షకు నల్లగొండ జిల్లా గురైంది. పోడు భూములు , అనేక తండాల సమస్య పరిష్కరించడంలో అప్పటి ప్రభుత్వాలు విఫలమయ్యాయి . అత్యధిక గ్రామీణ జనాభా కలిగిన జిల్లాగా పేరు ఉన్నపటికీ గ్రామాల్లో కనీస వసతులను ఏర్పాటు చేయడంలో నాయకులు, అప్పటి ప్రభుత్వాలు విఫలమైయ్యాయి . ఇదంతా ఒక్కపట్టి నల్లగొండ జిల్లా . 2014 తరవాత బంగారు తెలంగాణ అనే ఒక లక్ష్యంతో ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతుంది . ఉద్యమ సమయంలో అనేక సార్లు కెసిఆర్ గారు నల్లగొండ ప్రాంతంలో పర్యటించడం వలన అనేక సమస్యలను , ఎదుర్కుంటున్న వివక్షను కళ్లారా చూడడం జరిగింది . రాష్ట్రం ఏర్పాటు అవగానే కేసీఆర్ మరియు మంత్రి జగదీష్ రెడ్డి సారథ్యంలో నల్లగొండ జిల్లా అద్భుతమైన అభివృద్ధితో సాగుతుంది

నల్లగొండ జిల్లా ఉద్యమాల గడ్డ . ఇదే స్ఫూర్తితో అభివృద్ధిలో కూడా గత 10 ఏండ్ల నుండి పరుగులు పెడ్తుంది . మొట్టమొదట వ్యవసాయ రంగం తీసుకుంటే నల్లగొండ జిల్లా అద్భుతమైన పురోగతి సాధించింది .కరువు కాటకాలతో కొట్టుమిట్టాడిన జిల్లా నేడు తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వరి పండించే జిల్లాగ అవతరించింది. మిషన్ కాకతీయ , లాంటి పథకాల ద్వారా చెరువులు పునరుద్ధరించుకొని వ్యవసాయానికి అనుకూలంగా మారింది . రైతుబంధు పథకం ద్వారా రైతులు తిరిగి వరి పండించడం ప్రారంభించారు. మిషన్ భగీరథ అనే ఒక అద్భుతమైన పథకం ద్వారా ఈరోజు అనేక గ్రామాల్లో,మంచి నీరు పుష్కలంగా లభిస్తుంది . చౌటుప్పల్ మండంలో మిషన్ భగీరథ పైలాన్ ను కేసీఆర్ గారు ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా మిషన్ భగీరథ పనులకు ఎక్కడి నుండే శ్రీకారం చుట్టడం గొప్ప విషయం . ఫ్లోరోసిస్ అనే మహమ్మారి పూర్తిగా నల్లగొండ జిల్లా నుండి నిష్క్రమించడం జరిగింది . కేవలం 4 5 సంవత్సరాల్లో ఫ్లోరోసిస్ బాధల నుండి కొన్ని వెలది మంది ప్రజలు కోలుకున్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఫ్లోరోసిస్ ప్రభావం ఉన్న జిల్లాల నుండి నల్లగొండ జిల్లాను జరిగింది. గత 60 సంవత్సరాల్లో ఎన్నో ప్రభుత్వాలని చుసిన నల్లగొండ జిల్లా , ఎవరు కూడా ఈ సమస్యకు పరిష్కారం చూపలేదు. కేవలం తెరాస ప్రభుత్వంలోనే ఇది సాధ్యమైంది . ఉమ్మడి నల్లగొండ జిల్లా వైశాల్యం పరంగా ఒకరకంగా పెద్ద జిల్లా. 2016 అక్టోబర్ 16 విజయదశమి రోజున తెలంగాణ రాష్ట్రంలో ఆరోజు మైలురాయిగా నిలిచిపోతుంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఇక్కడ నుండి ప్రారంభం జరిగింది. 10 జిల్లాలుగా ఉన్న తెలంగాణ ఏకంగా 21 జిల్లాలతో కొత్తగా 31 జిల్లాలుగా తెలంగాణ రాష్ట్రం అవతరించింది . ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి సూర్యాపేట మరియు , యాదాద్రి భువనగిరి కొత్త జిల్లాలుగ అవతరించాయి. అనేక తండాలు కనీసం ప్రభుత్వ లెక్కలో పరిగినలోకి రానివి సైతం నేడు గ్రామ పంచాయతిలాగా ఏర్పడి అనేక అభివృద్ధి పనుల్లో ముందుకు సాగుతున్నాయి .

సూర్యాపేట జిల్లా అద్భుతంగా ముందుకు సాగుతుంది . కలెక్టరేట్ భవనాలు, ప్రభుత్వ బంగ్లాలతో , జిల్లా పరిపాలన ప్రజలకు మరింత చేరువైంది. భూమి విలువ పెరగడంతో ఆర్థికంగా , అద్భుతంగా ముందుకు సాగుతుంది సూర్యాపేట జిల్లా . జిల్లాల పునర్వ్యవస్థీకరణ కారణంగా అనేక పెద్ద గ్రామాలు నగరాలుగా విస్తరించాయి . కొత్తగా అనేక మునిసిపాలిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది. ఎప్పటినుండో ఉన్న నల్లగొండ జిల్లా కేంద్రంను మున్సిపాల్ కార్పొరేషన్ చేయాలి అనే ప్రతిపాదనను నేడు తెరాస ప్రభుత్వం నిజం చేసింది . నల్లగొండ జిల్లా కేంద్రంను మున్సిపల్ కార్పొరేషన్గ మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది . జిల్లా కేంద్రంలోని కూడలిలను , విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేసి ఎవరు ఊహించనివిధంగా అభివృద్ధి లో దూసుకుపోతుంది . ఎప్పుడు లేని విధంగా నగర అభివృద్ధికి అనేక నిధులు ప్రభుత్వం అందిస్తుంది . తెలంగాణాలో అత్యధిక గ్రామాలు ఉన్న జిల్లా నల్లగొండ జిల్లా . గ్రామాల్లో పల్లెప్రగతి పట్టణప్రగతి ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో చేయడం జరిగింది . దేశంలోనే అతిపెద్ద థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని దామరచర్లలో 30,000 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయడం జరుగుతుంది . దీని సామర్థ్యం 4000 MW . ఒక్కపుడు కరెంటు కోతలకు గురైన నల్లగొండ జిల్లా ఈరోజు అదే జిల్లాలో దేశంలోనే అతిపెద్ద విద్యుత్తు ప్లాంట్ నిర్మాణం జరగడం గొప్ప విషయం . ఈ ప్లాంట్ 2025 లోపు పూర్తియినతర్వాత తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఉన్న 17000 MW సామర్థ్యాన్ని 25000 MW సామర్థ్యానికి చేరుకుంటుంది . 2040 నాటికి ఎలాంటి విద్యుత్తు సమస్యలు లేకుండా దేశంలోనే మిగులు విద్యుత్తు రాష్ట్రంగా ఏర్పాటుకానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్నపటికీ యాదగిరిగుట్ట తీవ్ర వివక్షకు గురైంది . పాలమూరు రంగారెడ్డి చివరి దశలో ఉంది . ఈ ప్రాజెక్ట్ ద్వారా నల్లగొండ జిల్లాలోని లక్షల ఎకరాలకు అందుతుంది . కాళేశ్వరం ద్వారా సూర్యాపేట ఆయా ప్రాంతాల్లో జలాలు పుష్కలంగా ఉన్నాయ్ . వాటర్ టేబుల్ క్రమంగా పెరిగింది . నల్లగొండ జిల్లాకి ప్రాచీన యుగం మొదలుకొని దేశ స్వాతంత్ర్యం వరకు గొప్ప చరిత్ర ఉంది . నాగార్జునకొండ అత్యంత ప్రాచీనమైన శివాలయం , బౌద్ధ గుహలకు ప్రసిద్ధి . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బౌద్ధవనం ఏర్పాటు చేసి ప్రాచీన చరిత్రకు ఒక పునర్వైభవం తీసుకువచ్చింది . దేశంలోనే ఇది ఒక అద్భుతమైన ప్రదేశం. విదేశీ పర్యటకుల రాక ద్వారా జిల్లా ఎంతగానో అభివృద్ధి చెందుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ గారి గొప్ప సంకల్పంతో ఈరోజు యాదాద్రి రూపురేఖలే మారిపోయాయి . యాదాద్రి దివ్యక్షేత్రం నేడు ప్రపంచంలోనే గొప్ప దేవాలయంలో ఒకటిగా చెప్పుకోవచ్చు . యాదాద్రి భువనగిరి జిల్లా సైతం అభివృద్ధిలో దూసుకుపోతుంది . బస్వాపూర్ రిసర్వాయర్ చివరి దశలో ఉంది ఇది పూర్తయితే యాదాద్రి భువనగిరి జిల్లా గోదావరి జలాలతో కలకాలాడుతుంది. స్వచ్ఛ భారత్ అభియాన్ గ్రామీణ (SBM GRAMEEN) లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని అనేక గ్రామాలు కేంద్ర ప్రభుత్వ పురస్కారాలు పొందడం జరిగాయి . అనేక కొత్త సెజ్ లను (TSIIC - SEZ) ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుంది . పోచంపల్లి కళ మరియు సంస్కృతికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసింది . పోచంపల్లి నగరానికే ఒక వన్నె తెచ్చేవిధంగా అభివృద్ధి చేసింది . ఐక్యరాజ్య సమితి ప్రపంచ టూరిస్ట్ గ్రామాల్లో ఒకటిగా పేర్కొంది . ఇది రాష్ట్రానికే కాకుండా దేశానికి సైతం గర్వ కారణం . నేతన్నకు చేయూత , చేనేత లక్ష్మి, చేనేత మిత్ర లాంటి పథకాల ద్వారా చేనేత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన ప్రోత్సహకాలను అందిస్తుంది . ఇదే జిల్లాలో నీర పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది .

ఇవే కాక ఐటీ/పారిశ్రామిక రంగంలోనూ నల్లగొండ జిల్లా ముందుంది . రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు కేటీఆర్ చొరవతో బొమ్మల పరిశ్రమ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు కాబోతుంది. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఐటీ టవర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయ్. దండుమల్కాపూర్ లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుతో అనేక మంది యువత లబ్ది పొందుతున్నారు. ఈ పార్క్ ఆవిష్కరణకు ప్రస్తుతం మునుగోడులో బీజేపీ తరుపున పోటీలో ఉన్న రాజగోపాలరెడ్డి హాజరై తెలంగాణ ప్రభుత్వాన్ని ఆకాశం అంత ఎత్తుకు పొగిడి, ఈ రోజు ఎందుకు విమర్శ చేస్తున్నాడో వారి విజ్ఞతకే వదిలేయాలి. అనేక IT SEZ , MANUFACTURING హబ్లను నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వచ్చే 2024 వరకు తెలంగాణలోని అన్ని జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

దశాబ్దాలుగా వెనుకబాటుకు, కరువుకు, వివక్షకు గురైన జిల్లా నేడు బంగారు తెలంగాణాలో భాగంగా నల్లగొండ జిల్లా అభివృద్ధి ప్రధాన పాత్ర పోషిస్తుంది . కొమ్ములు తిరిగిన పెద్ద పెద్ద నాయకులు ఎంతో మంది నల్లగొండ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో వివక్ష జరుగుతున్న , మన కృష్ణ నది నీళ్లు అక్రమంగా తీసుకెళ్తున్న కనీసం వారిని నిందించిన వారు సైతం లేరు. కానీ నేడు తెలంగాణ రాష్ట్రం లో అద్భుతమైన పురోగతి నల్లగొండ జిల్లా సాధిస్తుంది.



- కన్నోజు శ్రీహర్ష
ఫోన్: 8985130032

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్‌గా మారనుందా?




**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ మళ్ళీ టీఆర్ఎస్ గా మారనుందా? మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అవే సంకేతాలిచ్చారా? ఆయన బీఆర్ఎస్ కండువాకి బదులు టీఆర్ఎస్ కండువా వేసుకోవడం వెనుక ఆంతర్యమేంటి? ఈ విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆయన పొరపాటున ఆ కండువా వేసుకున్నారా? లేక కావాలనే వేసుకున్నారా? అనేదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చ. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని జాతీయ పార్టీగా తీసుకొస్తూ భారత రాష్ట్ర సమితి అని కేసీఆర్ నామకరణం చేశారు. అనంతరం ఆయన దేశ రాజకీయాల్లో అడుగుపెట్టారు. కానీ సీన్ రివర్స్ అయింది. ఆయన దేశ రాజకీయాలపై ఫోకస్ చేసి రాష్ట్రంలో ఓటమిపాలయ్యారు. బీఆర్ఎస్ అని పేరు మార్చిన దగ్గర నుంచి కలిసి రావడంలేదనే చర్చ శ్రేణుల్లో మొదలైంది. మళ్ళీ టీఆర్ఎస్ గా పేరు మార్చాలనే డిమాండ్స్ కూడా మొదలయ్యాయి. పార్టీలో కీలక నేతలు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి భారత రాష్ట్ర సమితి అని పేరు మార్చిన తర్వాత పార్టీ తెలంగాణ ప్రజలకి దూరం అయిందనే భావన కలిగిందన్నారు. పార్టీ తెలంగాణ సెంటిమెంట్ కోల్పోయిందని అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం పేరు మార్చే ఆలోచనలో లేరనేది పార్టీ వర్గాలు చెబుతోన్న విషయం. అయితే, సడెన్ గా ఇప్పుడు హరీష్ రావు మెడలో టీఆర్ఎస్ కండువా దర్శనమివ్వడం హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ ప్రజల్లో సెంటిమెంట్ రగల్చడానికి మళ్ళీ టీఆర్ఎస్ గా పేరు మార్చనున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పటాన్ చెరు పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన టీఆర్ఎస్ కండువా కప్పుకుని సంకేతాలిచ్చారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ కండువాలు లేక దొరికింది కదా అని పాత కండువా కప్పుకున్నారా అంటే ఆయనకి ఒక్కరికే ఎందుకు ఉండదు? పైగా పార్టీ హైకమాండ్ లో ఆయన కీలక సభ్యుడు... అలాంటి వ్యక్తి అజాగ్రత్తగానో, ఏమరపాటునో పార్టీ కండువా మార్చరు కదా! టీఆర్ఎస్ కండువా కప్పుకుని ప్రజల రియాక్షన్ ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ పని చేశారేమో అనే సందేహాలు కూడా మొదలవుతున్నాయి. ఏది ఏమైనా బీఆర్ఎస్ అలానే ఉంటుందా? లేక టీఆర్ఎస్ గా మారనుందా తెలియాలంటే వేచి చూడాల్సిందే.

## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ నాయకురాలు నేరెళ్ల శారదను నియమించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద మాట్లాడుతూ... నాపైన నమ్మకం ఉంచి మహిళా కమిషన్ చైర్మన్ గా నియమించిన ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళలపైన జరుగుతున్న అకృత్యాలపై అవగాహన కల్పిస్తానని వివరించారు. మహిళల సంరక్షణతో పాటు పురుషులు స్త్రీలను గౌరవించే విధంగా పని చేస్తామన్నారు. మహిళా కమిషన్ సమీక్ష సమావేశం తరువాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద. మహిళల కోసం 5వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని.. మహిళా సంఘాల వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిం దని వివరించారు.

## ఉస్మానియాలో విజయవంతంగా కాలేయ మార్పిడి చికిత్స

(మొదటి పేజీ తరువాయి)
తాజాగా మరో చిన్నారికి కాలేయ మార్పిడి చికిత్స విజయవంతమైంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం కొండవనమాల గ్రామానికి చెందిన మోదుగు గుణశేఖర్, అమల దంపతుల కుమారుడు మాస్టర్ చోహన్ ఆదిత్య (3 సంవత్సరాలు) పుట్టుకతోనే పిత్తాశయ ధమని, కాలేయ సమస్యతో బాధపడుతున్నాడు. చోహన్ ఆదిత్యను పరిశీలించిన ఉస్మానియా వైద్యులు మధుసూదన్ నేతృత్వంలోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, కాలేయ మార్పిడి బృందం ఈ నెల మూడో తేదీన ఆదిత్యకు ఉస్మానియా ఆసుపత్రిలో కాలేయ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. చోహన్ ఆదిత్య మాతృమూర్తి అమల కాలేయాన్ని తన కుమారునికి దానం చేయడంతో కొంత భాగాన్ని తీసుకొని బాలునికి అమర్చారు. ప్రస్తుతం తల్లీకుమారుడు క్షేమంగా ఉన్నారు. వారిని మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

## మహారాష్ట్ర-చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కాల్పుల మోత

(మొదటి పేజీ తరువాయి)
చోటుచేసుకుంది. ఈ ఎదురుకాల్పుల ఘటనలో 12 మంది నక్సల్స్ మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ లో పాల్గొన్న పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ సతీశ్ పాటిల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలం నుంచి అనేక ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్ కౌంటర్ లో హతులైన మావోయిస్టుల్లో ఇద్దరు తెలుగు వాళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మధ్యాహ్నం 7 సీ60 కమాండో దళాలు వందోలి గ్రామం వద్ద నక్సల్స్ సమావేశం అయ్యారన్న సమాచారంతో కూంబింగ్ కు బయల్దేరాయి. ఈ సందర్భంగా సీ60 కమాండో బలగాలకు, మావోయిస్టులకు మధ్య దాదాపు ఆరు గంటలకు పైగా భీకర కాల్పులు జరిగాయి. కాగా, మృతి చెందిన వారిలో సీనియర్ డివిజనల్ కమిటీ మెంబర్ కూడా ఉన్నట్టు గుర్తించారు.



# 'అహంకారంతో ప్రవర్తిస్తే ఏమవుతుందో కవితను చూస్తే తెలుస్తుంది'

**సంచలనం సృష్టిస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి వ్యాఖ్యలు.. తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు**

**విశ్వంభర, హైదరాబాద్:**

కల్వకుంట్ల కవితపై జస్టిస్ నరసింహారెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అసలు కవిత గురించి కామెంట్ చేయాల్సిన అవసరం జస్టిస్ కు ఏమొచ్చిందో? ఎందుకు కామెంట్ చేశారో కూడా తెలీటంలేదు. కవిత గురించి మాట్లాడుతు 'అహంకారంతో ప్రవర్తిస్తే ఏమవుతుందో కవితను చూస్తే తెలుస్తుంది' అని జస్టిస్ అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇరుక్కున్న కవిత మార్చినెల 15వ తేదీనుండి తీహార్ జైలులోనే ఉన్న విషయం తెలిసిందే. బెయిల్ కోసం ఎన్నిరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా సాధ్యంకావటంలేదు. అనారోగ్యమని, కొడుకు చదువు, పరీక్షలని, ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్ హోదాలో ప్రచారం చేయాలనే కారణాలను ఎన్నింటినీ చూపించినా కోర్టు మాత్రం దేనికీ అంగీకరించలేదు. అందుకనే గడచిన నాలుగు నెలలుగా తీహార్ జైలులోనే ఉన్నారు. తాజాగా జస్టిస్ నరసింహారెడ్డి కవితపై చేసిన వ్యాఖ్యలతో జనాలందరికీ పై విషయాలన్నీ గుర్తుకురావటం ఖాయం. అహంకారంతో ప్రవర్తించిన వాళ్ళకు కవితకు పట్టిన గతే పడుతుందని అర్థమొచ్చేట్లుగా జస్టిస్ కామెంట్ చేశారు. దానిపై బీఆర్ఎస్ నేతలు తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం



చేస్తున్నారు. జస్టిస్ నరసింహారెడ్డికి అసలు కవిత గురించి మాట్లాడాల్సిన అవసరం ఏమొచ్చిందో చెప్పాలంటు నిలదీస్తున్నారు. ఇక్కడ విషయం ఏమిటంటే ఛత్తీస్ ఘడ్ నుండి కొనుగోలు చేసిన విద్యుత్ లో అవినీతి జరిగిందనే ఆరోపణలపై ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డితో విచారణ చేయించేందుకు కమిషన్ వేసిన విషయం తెలిసిందే. ఛత్తీస్ ఘడ్ ఒప్పందంలో అవినీతి, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో అవినీతి, అవకతవకలపైన కూడా విచారణ చేశారు. అయితే విచారణపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తు కేసీయార్ సుప్రింకోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన సుప్రింకోర్టు కమిషన్ ఛైర్మన్ గా జస్టిస్ నరసింహారెడ్డిని తప్పుకోవాలని ఆదేశించింది. నరసింహారెడ్డి ప్లేసులో మరొకరిని నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సుప్రింకోర్టు ఆదేశాలతో నరసింహారెడ్డి కమిషన్ ఛైర్మన్ గా తప్పుకున్నారు. ఈ నేపధ్యంలోనే ఒక ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతు విద్యుత్ రంగంలో జరిగిన అవినీతి, అవకతవకలపై తన విచారణ పూర్తయిపోయిందన్నారు. రిపోర్టును ప్రభుత్వానికి అందచేయటం మాత్రమే మిగులుందని చెప్పారు. ఈ విషయం చెబుతునే కవితపైన కూడా కామెంట్ చేశారు. కవితపైన జస్టిస్ నరసింహారెడ్డి చేసిన కామెంటుపైనే బీఆర్ఎస్ వర్గాలు భగ్గుమంటున్నాయి. మరి కవితకు వ్యతిరేకంగా జస్టిస్ నరసింహారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారు ? వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే విషయమై నరసింహారెడ్డే వివరణ ఇవ్వాలి. మరి తాజా వివాదం ఎక్కడకు దారితీస్తుందో చూడాల్సిందే.0

# బీజేపీ అధ్యక్షుడిగా ఈటల!

(మొదటి పేజీ తరువాయి)
ఫాలోయింగ్ ఉన్న నాయకుడు ఆయన.సామాజికవర్గం పరంగా బీసీ కావడం కూడా ఆయనకు కలిసొచ్చే అంశం.రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటంలో కూడా తానే ముందున్నందున ఆయనకే సారధ్య బాధ్యతలు అప్పగిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండుచోట్ల ఓడినప్పటికీ మల్కాజిగిరి ఎంపీ సీటు విషయంలో ఆయనకే అవకాశం కల్పించింది బీజేపీ.లోక్ సభ ఎన్నికల్లో అధిష్టానం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ ఆయన మల్కాజిగిరి ఎంపీగా గెలిచారు.

**బిజీ షెడ్యూల్ లో బండి సంజయ్**

కేంద్రమంత్రిగా ఉన్న ప్రస్తుత అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాతీయ రాజకీయాల్లో చాలా బిజీగా ఉన్నారు.రాష్ట్ర రాజకీయాలపై దృష్టి పెట్టలేనంత బిజీ షెడ్యూల్ లో ఉన్నారాయన. తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం చాలా హాట్ గా మారాయి. బీఆర్ఎస్ ను ఖాళీ చేయించే పనిలో కాంగ్రెస్ పార్టీ నిమగ్నమైంది.ఈ క్రమంలో ప్రభుత్వ తప్పిదాలపై ఆందోళనలు చేయాలన్నా నడిపించే వారు లేక బీజేపీ కేడర్ సంకోచించే పరిస్థితి ఏర్పడింది.ఇదే సమయంలో బీజేపీ అధ్యక్షుడిని ప్రకటిస్తే రాజకీయం మరింత రంజుగా మారుతుంది.రాష్ట్ర అధ్యక్ష రేసులో ఓ నలుగురి పేర్లు వినిపిస్తున్నా కిషన్ రెడ్డి సపోర్ట్ ఈటలకే ఉందని సమాచారం. మల్కాజ్ గిరి టికెట్ ఈటలకే దక్కడం వెనుక కిషన్ రెడ్డి కృషి ఉంది.దీంతో కాబోయే అధ్యక్షుడు ఆయనే అంటూ టాక్ నడుస్తోంది. తాజా లోక్



సభ ఎన్నికల్లో రాష్ట్రం నుండి 8మంది ఎంపీలు గెలిచారు. కిషన్ రెడ్డితో పాటు మరో ఇద్దరికి మంత్రి పదవులు వస్తాయని,వారిలో బండి సంజయ్ తో పాటు ఈటలకు కూడా ఉన్నారని చివరి వరకు ప్రచారం జరిగింది. ప్రమాణ స్వీకారానికి ముందు రోజు అమిత్ షా ఈటలను పిలిపించి మాట్లాడటంతో ఈటలకు అధ్యక్ష పదవి ఇస్తారని అంతా ఫిక్స్ అయ్యారు. అయితే ప్రకటనలో జాప్యం జరుగుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికతో రాష్ట్ర అధ్యక్ష నియామకాన్ని ముడిపెట్టడంతో అప్పటి వరకు సైలెంట్ గా ఉండకుండా రేవంత్ సర్కారు పై ఈటల విమర్శలు సంధిస్తున్నారు. ఆయనతో పాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అప్పుడప్పుడు విమర్శలు చేస్తున్నారే తప్ప ఎవరూ పెద్దగా మాట్లాడటం లేదు.రైతు రుణమాఫీ, గ్రేటర్ పరిధిలో ఇండ్ల నిర్మాణాల కూల్చివేత సహ పలు అంశాల్లో రేవంత్ రెడ్డిని టార్గెట్ చేయటంలో ఈటల దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఈటలకే అధ్యక్ష బాధ్యతలు దక్కుతాయని పార్టీ నేతలు అంటున్నారు.




# 4 గంటలకు రూ.లక్ష

(మొదటి పేజీ తరువాయి)
రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకం కలిగించడం మన బాధ్యత. అందుకే ఇబ్బందులు ఎదురైనా రైతురుణమాఫీ హామీకి కట్టుబడి అమలుచేస్తున్నామని" సీఎం చెప్పారు.

**నా జీవితంలో గుర్తుండిపోయే రోజు..**

ఈ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలి అని సీఎం ఆశించారు. వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్ ను దేశం అనుసరించేలా ఉండాలన్నారు. నా జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అని రేవంత్ అన్నారు. నేటి సాయంత్రం 4గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతురుణాలు మాఫీ చేస్తున్నామన్నారు. రూ.7వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళతాయని చెప్పారు. ప్రతీ రైతును రుణ విముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది... అందుకే ఏకమొత్తంలో రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నామన్నారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే రూ.2లక్షల రైతు రుణమాఫీ అన్నారు.

**జాతీయ స్థాయిలో చర్చ జరగాలి...**


పదేళ్లు అధికారంలో ఉండి కూడా కేసీఆర్ రూ.28 వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారని రేవంత్ విమర్శించారు. రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడంలేదన్నారు. "దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ.31వేల కోట్లతో రుణమాఫీ చేయలేదు. రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారెంటీని అమలు చేశామని పార్లమెంట్ లో ఎంపీలు ప్రస్తావించాలి. రుణమాఫీపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి" అని రేవంత్ ఆశించారు. గురువారం గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలని శ్రేణులకు ఆదేశించారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబరాలు జరపాలని కోరారు. "ఏడు నెలల్లో మన ప్రభుత్వం సంక్షేమానికి రూ.30వేల కోట్లు ఖర్చు చేసింది. మనం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించండి. రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి" అని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



# భట్టి తీవ్ర అసంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)
అమలుచేస్తున్నా ప్రజల్లో రావాల్సిన గుర్తింపు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ప్రజాభవన్ లో ఏర్పాటైన కాంగ్రెస్ కీలక నాయకులు సమావేశంలో భట్టి తన ఆవేదన వెళ్లగక్కారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆగస్టు దాటకుండానే రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని ప్రకటించారు. రుణమాఫీ కార్యక్రమం అమలు చేసేందుకు నిద్రలేని రాత్రులు గడిపామని భట్టి చెప్పారు. "రూపాయి రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టాం. అన్ని కుటుంబాలకు రుణమాఫీ చేస్తాం. రేషన్ కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ అందిస్తామని హామీ ఇచ్చారు. మిగులు బడ్జెట్ తో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని 25000 చొప్పున నాలుగు దపాలుగా పూర్తి చేశారు. ఏడు లక్షల కోట్ల అప్పులతో అధికారం చేపట్టిన మనం రెండు లక్షల రుణమాఫీని నెలల వ్యవధిలోనే అమలు చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఐదు హామీలు అమలు చేస్తున్నాము" అని భట్టి తెలిపారు. "పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తే అంతా ఆశ్చర్యపోయారు. సీఎం సవాల్ ఓట్ల కోసమే.. ఎన్నికల సవాల్ అనుకున్నారు. కానీ అందరి అంచనాలు తలకిందులు చేస్తూ రూపాయి రూపాయి పోగుచేసి రుణమాఫీని అమలు చేయబోతున్నాము. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అయితే అనుకున్నంతగా ఈ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రచారం జరగడం లేదు" అని భట్టి అసంతృప్తిని వ్యక్తపరిచారు. "కాంగ్రెస్ నాయకులారా, రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రతి పోలింగ్ బూతు, ప్రతి ఓటర్ దగ్గరకు కార్యక్రమాన్ని తీసుకెళ్లాలి. తల ఎత్తుకొని... ఎక్కడ తగ్గకుండా ప్రచారం చేయండి. కాంగ్రెస్ నేతలందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడే కార్యక్రమం రుణమాఫీ. చెప్పిన మాట ప్రకారం చేస్తున్నామని ప్రతి గ్రామానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది.. అని వివరించి రైతులు ప్రజల హృదయాలు గెలవాలి" అని కాంగ్రెస్ శ్రేణులకు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## శ్రీలంక మాజీ క్రికెటర్ హత్య.. భార్య, పిల్లల ముందే కాల్చివేత



**శ్రీలంక:** శ్రీలంక మాజీ క్రికెటర్ ధమ్మిక నిరోషణ (41) దారుణహత్యకు గురయ్యాడు. మంగళవారం రాత్రి అంబలంగోడాలోని అతడి నివాసంలో భార్య, పిల్లల ముందే ఓ దుండగుడు తుపాకీతో కాల్చి చంపాడు. హత్యకు పాల్పడ్డ దుండగుడిని గుర్తించేందుకు పోలీసులు రంగంలోకి దిగి, దర్యాప్తు చేస్తున్నారు. దీనిని ముఠా కక్షలుగా భావిస్తున్నామని, నిందితుడిని పట్టుకునేందుకు అన్వేషిస్తున్నట్టు శ్రీలంక పోలీసు అధికారులు వెల్లడించారు. నిరోషణ 2002లో శ్రీలంక అండర్19 క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఫాస్ట్ బౌలర్ అయిన నిరోషణ శ్రీలంక జాతీయ జట్టుకు అతడు ఎంపిక కాలేకపోయాడు. తక్కువ వ్యవధిలోనే అతడి క్రికెట్ కెరియర్ ముగిసిపోయింది. 2000లో శ్రీలంక తరపున అండర్19లోకి అరంగేట్రం చేశాడు. దేశవాళీ క్రికెట్ లో గాలే స్పోర్ట్స్ క్లబ్ తరపున ఆడాడు. అండర్ 19 జట్టుకు నిరోషణ సారధ్యం వహించినప్పుడు ఏంజెలో మాథ్యూస్, ఉపుల్ తరంగ, ఫర్వీజ్ మహరూఫ్ జట్టులో ఉన్నారు. ఇక అతడు 12 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 26.89 బౌలింగ్ సగటుతో 19 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్ విషయానికి వస్తే, 19 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 14.94 సగటుతో 269 పరుగులు చేశాడు.

# కుల, మతాలకు అతీతంగా పీర్ల పండుగ







**విశ్వంభర, ఆత్మకూరు(ఎం)/ఆమనగల్లు/నారాయణఖేడ్/కరీంనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మరియు మోటాకొండూర్ మండల కేంద్రాలలో బుధవారం అమరుల త్యాగల ఫలితంగా మొహరం పండుగను హిందూ, ముస్లింలు కులామతాలకు అతీతంగా పెద్ద ఎత్తున జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాల్లో గ్రామ వీదుల గుండా పీర్ల శోభాయాత్ర డప్పు వాయిద్యాలతో ఆట పాటలతో ఘనంగా కొనసాగింది. ఈ పీర్లను చూసేందుకు ప్రజలు పెద్దెత్తున వచ్చారు. పీర్లకోట్టంలలో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు ఆయా గ్రామాల్లో భక్తులు పూలు, దట్టీలు సమర్పించారు. తెల్లవారుజామున మొహర్రం పండుగలో భాగంగా పీర్ల సవారీతో గ్రామ వీధుల్లోకి రాగా భక్తులు దారి పోడవునా నీరుపోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పీర్ల పండుగలో ఆయాగ్రామాల్లో ఆయాపార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని సంఘటోనీ పల్లి గ్రామంలో మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి వార్డు కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొని దట్టీలు, కుడుకలు, బెల్లం సమర్పించారు. గ్రామంలో హిందూ ముస్లింలు కలిసి మత సామరస్యానికి ప్రతిగా చెప్పే మొహర్రాన్ని ఘనంగా చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీ పాల్, మత పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో..**




నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో మతాలకతీతంగా ఇరు వర్గాల ప్రజలు భక్తుశ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకున్నారు. మతాలకతీతంగా ఐదోష్తుల అంటూ పాటలు పాడుతూ ఉత్సాహభరితంగా కోలలు వేస్తూ తమ భక్తిని ఇరు వర్గాల ప్రజలు చాటుకున్నారు. పండుగ సందర్భంగా ప్రజలు ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకున్నారు.




**కరీంనగర్‌లో...**

నగరంలోని పురాతన జామా మసీదు వద్ద ఆశీర్ఖానా వద్ద పదవ మొహర్రం యౌమే అషూర సందర్భంగా ఎంఐఎం పార్టీ సిటీ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ ఖమరుద్దీన్ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హాజరయ్యారు. పీరీల వద్దకు వచ్చిన నగర ప్రజానికానికి షర్బతును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ రాక్షస పాలకులకు ఎదురు నిలచి ధర్మాన్ని, ప్రజా హక్కులను కాపాడడం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తదితరులు చేసిన మహోన్నత త్యాగాలు ప్రపంచానికి చాటాయన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, ఎంఐఎం జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదిరి యూసుఫ్, మౌలాన ఖయ్యుం జియాయి, యూసుఫ్ బాబా, ఆయూబ్ ఖాన్, ఖదీర్ తదితరులు ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్లు పెంచాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దమాషా ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీలకు తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతంకు బీసీ రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీనిచ్చిందని, ఇచ్చిన హామీని ఎన్నికల్లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి, ప్రభుత్వంపైన నిరంతరం ఒత్తిడి పెంచడానికి, బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బీసీ కుల సంఘాల ఐకాస ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సాధన యాత్రను నిర్వహిస్తున్నామని, ఈ యాత్ర ఈనెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమై కరీంనగర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 17 రోజుల పాటు ఉంటుందన్నారు. ఈనెల 18న హన్మకొండ హంటర్ రోడ్ సత్యం కన్వెన్షన్ హాల్ లో సమగ్ర కులగణన సాధన యాత్ర సభ ఉంటుందని, ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీ కులస్తులందరూ, కులాల కతీతంగా, పార్టీలకతీతంగా ఏకమై సమగ్ర కులగణన సాధన యాత్ర సభలో అత్యధికంగా పాల్గొని, బీసీల ఐక్యతను చాటాలని వేముల మహేందర్ గౌడ్ పిలుపునిచ్చారు.

# హన్వాడ విగ్రహావిష్కరణకు బయలుదేరిన షాద్‌నగర్ ముదిరాజ్ నాయకులు



**విశ్వంభర, షాద్‌నగర్ :** పేదల కోసం పోరాడిన యోధుడు పండుగ సాయన్న తెలంగాణ రాబిన్‌హుడ్ అని కాంగ్రెస్ పార్టీ తరపున మెదక్ పార్లమెంట్ ఎంపీ స్థానానికి పోటీ చేసిన నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని హన్వాడ పట్టణంలో బుధవారం నిర్వహించే పండుగ సాయన్న విగ్రహావిష్కరణ సందర్భంగా షాద్ నగర్ పట్టణానికి వచ్చి పండగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పండగ సాయన్న 133వ జయంతి సందర్భంగా ఆయన ప్రసంగించారు. వందేళ్లకు పైగా ఆయన చరిత్రను ఉమ్మడి రాష్ట్రంలో తొక్కేశారని చెప్పారు. ఆ వీరుని ఖ్యాతిని మరింతగా పెంచే బాధ్యత మనపై ఉందన్నారు. ధనవంతులతో పోరాడి, పేదలకు సాయం చేసిన సాయన్నను స్మరించుకోవటం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో పండుగ సాయన్న, నాగన్న, మియాసాబు వంటి మహావీరుల చరిత్రలు ఎన్నో ఉన్నాయన్నారు. పండుగ సాయన్న జీవిత చరిత్ర మనమందరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నేడు హన్వాడ పట్టణంలో పండగ సాయన్న భారీ విగ్రహావిష్కరణకు షాద్నగర్ పట్టణం నుండి దాదాపు 500 మంది ముదిరాజ్ నాయకులు ముదిరాజ్ బంధువులు నీలం మధు ముదిరాజ్ తో కలిసి వెళ్లారు.

# శాంతినగర్‌లో ప్రాథనిక పాఠశాల ఏర్పాటు చెయ్యాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కైలాపూర్ గ్రామ పంచాయితీ శివారు శాంతినగర్‌లో నివసిస్తున్న పేద కుటుంబాల పిల్లలకు చదువుకోవడానికి బడి లేక 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న టేకుమట్ల , చిట్యాల పాఠశాలలకు వెళ్తున్నారు అని ఎన్ని ప్రభుత్వలు మారినా ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చెయ్యలేకపోతున్నారు అని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మల్లేష్ ఆరోపించారు. జిల్లా కలెక్టర్ , నియోజకవర్గం ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడి పర్మినెట్ బిల్డింగ్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు న్యాయం చెయ్యాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చేరిపెల్లి విజయ్, పార్లపెల్లి శ్రీకాంత్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మూడవ రోజు కొనసాగుతున్న

# కాళేశ్వరంలో భక్తుల పుణ్య స్నానాలు



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాలేశ్వరం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. త్రివేణి సంఘంలో స్నానమాచరించిన భక్తులు ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఆషాడ మాస శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశిగా, పెద్ద ఏకాదశి పండుగగా పిలుస్తారు. ఈ రోజు నుంచి శ్రీమహావిష్ణువు నాలుగు నెలల పాటు శయన నిద్రలో ఉంటారని ఈ నాలుగు నెలలపాటు చాతుర్మాస దీక్షను పాటించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ భక్తులు నదికి విచ్చేసి పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూపాలపల్లి జిల్లాలో అత్యధికంగా 25.48 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది.

# పశువులను రోడ్లపై వదల కూడదు

**విశ్వంభర, హుజూర్ నగర్ :** హుజూర్ నగర్ పట్టణ పరిధిలో ఉన్న గేదెలు, ఆవులు మరియు అని రకముల పశువులను యజమానులు రోడ్ల మీద వదులుట వల్ల ప్రయాణికులు వాహన దారులు ప్రమాదములకు గురవుతున్నారని కావున పశువులను యజమానులు తమ స్థలములలో ఉంచుకోవాలని, లేనియెడల 24 గంటల లోపు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గేదెలు, ఆవులను గోషాలకు తరలించనున్నట్లు పురపాలక సంఘం కమీషనర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల హుజూర్ నగర్‌లో రోడ్డుపై అకస్మాత్తుగా వచ్చిన ఓ పశువును ఓ ఆటో ఢీ కొట్టగా ఆ మూగ జీవి తీవ్రగాయాల పాలైంది.



# బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా అరవింద్‌రావు



**విశ్వంభర, పరిగి :** వికారాబాద్ జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు బుధవారం వికారాబాద్ అయ్యప్ప స్వామి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ ఉపాధ్యక్షుడు వైద్య ప్రభాకర్ శర్మ మరియు రాష్ట్ర ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. బ్రాహ్మణ సేవా సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులుగా పరిగి మండలం పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కరణం అరవింద్ రావు ను ఎన్నుకోవడం జరిగింది. అతనిని బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు వామన్ రావు, శంకర్ రావు, సేతు రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# వానరానికి అంతక్రియలు



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో వెంకటేశ్వర స్వామి మందిరం ఎదుట ఉన్న ట్రాన్స్ఫారంపై వానరం పడి విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మెట్పల్లి బజరంగ్దళ్ కార్యకర్తలు హిందూ సంప్రదాయ ప్రకారం జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో వానరానికి పూజలు నిర్వహించి వెల్లుల్ల రోడ్డు స్మశాన వాటిక దగ్గర పూడ్చారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



**కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్‌ల్లో కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శాలువా కప్పి సాదరంగా ఆహ్వానించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**

**- విశ్వంభర, షాద్‌నగర్**

## ఆరోగ్యకరమైన

# జర్నలిస్టు సమాజమే డబ్ల్యూజేఐ లక్ష్యం

○ బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రవిశంకర్ అల్లూరి




**విశ్వంభర, కరీంనగర్ :** ఆరోగ్యకరమైన జర్నలిస్టు సమాజం, ఆరోగ్యకరమైన జర్నలిస్ట్ పరివారం బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ ఉద్దేశమని బీఎంఎస్ అఖిలభారత కార్యవర్గ సభ్యుడు రవిశంకర్ అల్లూరి అన్నారు. కరీంనగర్ పట్టణంలో బిఎమ్ఎస్ అనుబంధ డబ్ల్యూ జే ఐ జిల్లా శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులు దీపంలా సమాజానికి వెలుగునిస్తున్నారని, అయితే దీపం కింద చీకటిలా వారి పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమైక్య పోరాటాలకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. జర్నలిస్టులకు సంబంధించి సంఘాలు ఏవి ఉన్నా, అవి జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడడం పరమావధిగా భావించాలన్నారు. జర్నలిస్టులకు కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జర్నలిస్టుల బాధలను అర్థం చేసుకొనే సంఘాల అవసరం ఉందన్నారు. జాతీయ వాద జర్నలిస్టులను ఏకం చేసి జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడేందుకు, దేశ పురోభివృద్ధికి పాత్రికేయులు దోహదపడేలా కృషిచేసి వారి సంకల్పాలను సామరస్యతతో నెరవేర్చేందుకు జాతీయస్థాయిలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ఆవిర్భవించిన విషయాన్ని గుర్తు చేశారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నందనం కృపాకర్ సభకు అధ్యక్షత వహించారు. దేశంలోనే అతిపెద్ద, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద కార్మిక సంఘమైన భారతీయ మజ్దూర్ సంఘ్‌కు అనుబంధంగా డబ్ల్యూజెఐ ఏర్పాటై ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం గుర్తింపు పొంది ఇప్పటికే 16 రాష్ట్రాలలో కార్యకలాపాలు చేపడుతుందని రవిశంకర్ తెలిపారు. జర్నలిస్టులకు పెన్షన్ సాధించే క్రమంలో మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిందన్నారు. తెలంగాణలోని జిల్లాలో కమిటీల ఏర్పాటు, సభ్యత నమోదు ప్రక్రియ కూడా ప్రారంభమైందని కరీంనగర్‌లో ప్రారంభమైన సభ్యత నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇందులో జర్నలిస్టులు అందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ అంత ఆన్లైన్లో జరుగుతుందన్నారు. 35 సంవత్సరాలుగా ఓ జర్నలిస్టు సంఘంలో పనిచేసిన సీనియర్ పాత్రికేయులు తాడూరి కరుణాకర్‌తో పాటు కరీంనగర్ జిల్లాలోని మండలాల నుంచి వచ్చిన పాత్రికేయులు సుమారు వందమంది సభ్యత్వాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ దేశాయ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివాజీ, ఆయా మండలాల పాత్రికేయులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు

# కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)బడుగు బలహీన వర్గాలకు చెందిన పైల్ల కిష్టయ్య హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. మరియు చిన్నం మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఇరువురు మృతుల యొక్క కుటుంబ సభ్యులకు తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి, పాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతగాని మల్లేశంలతో కలిసి మృతుల పార్థీవ దేహాలకు పూల మాలవేసి నివాళులర్పించి బాధిత ఇరు కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య ఆదేశానుసారం రెండు కుటుంబాలకు రూ.5000 చొప్పున మొత్తం 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందచేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, రజక సంఘం అధ్యక్షులు ఎలిమినేటి మురళీకృష్ణ, కురుమ సంఘం అధ్యక్షులు మజ్జిగ రాంబాబు, నాయకులు కట్టెకోల హన్మంతు గౌడ్, పైల్ల దామోదర్ రెడ్డి, ఎలగందుల సైదులు, దొంతరబోయిన భాస్కర్, నోముల యాదగిరి, నాగం మధుసూదన్ రెడ్డి, ఉగ్గే నరేష్, పైల్ల బుచ్చి రెడ్డి, ఎడ్ల మోహన్ రెడ్డి, రంగ శేఖర్, బండ చంద్రయ్య, కోరే కనకయ్య, ఎలగందుల మల్లయ్య, ఎలగందుల శ్రీను, దబ్బేటి లక్ష్మణ్, వెల్మేకన్నే స్వామి, సత్యనారాయణ, బాసాని శంకర్, గవ్వల బాలరాజు, మజ్జిగ మల్లయ్య, కొమురయ్య, శ్రీశైలం, వీరసరుపు నరహరి, యాస సుభాష్ రెడ్డి, దిగోజు భరత్, గట్టు శ్రీరాములు, జ్ఞానేశ్వర్, విద్యాసాగర్, రాజు, బండ సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# భూదాన యజ్ఞ బోర్డు పునరుద్ధరణకు కృషి

- భూదాన రామచంద్రా రెడ్డి 119వ జయంతి సభలో
తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నా రెడ్డి



**విశ్వంభర,హైదరాబాద్:** భూదాన యజ్ఞ బోర్డు పునరుద్ధరణ, అన్యాక్రాంతమైన భూదాన భూములను తిరిగి భూదాన బోర్డుకు అప్పగించడం, భూదాన భూములను పంపిణీ చేసే విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకెళ్ళి తగిన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నా రెడ్డి చెప్పారు. భూదాన ఉద్యమం, తెలంగాణ సాయుధపోరాటం, ఉద్యమ అమరవీరుల చరిత్రను పాఠ్యాంశాలలో పొందుపర్చడం, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై లేదా ఇతర ముఖ్యమైన ప్రాంతంలో అమరవీరుల విగ్రహాలను ఏర్పాటు చేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన తెలిపారు. ఇందు కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన చెప్పారు. భూదాన ఉద్యమానికి బీజం వేసిన భూదాన్ (వెదిరె) రామచంద్రా రెడ్డి 119వ జయంతి సభ బుధవారం హైదరాబాద్ బషీర్ బాగ్ లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. భూదాన (వెదిరె) రామచంద్రా రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ వెదిరె ప్రభోద్ చంద్రా రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డాక్టర్ చిన్నా రెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఎ.నరసింహా రెడ్డి, తెలంగాణ భాషా, సాంస్కృతిక మండలి ఛైర్మన్ డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, ఆలిండియా సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి, అఖిల భారత సర్వసేవ సంఘ్ జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి, కార్యదర్శి ఎ.రవీంద్రాచారి, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ టి.కృష్ణా గౌడ్, అతిథులుగా అమరవీరుల వారసులు భీంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మల్లు కరుణ, ఆరుట్ల శ్రీకాంత్, చిట్యాల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నా రెడ్డి మాట్లాడుతూ మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన భూదాన యజ్ఞ బోర్డును పునర్ నిర్మించడం వల్ల ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసిన తెలంగాణ సాయుధ పోరాటం, భూదాన ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ వీరుల కుటుంబాలకు చెందిన వారసులు తమ ప్రజా సేవను కొనసాగించేందుకు రాజకీయాల్లోకి రావాలని, తద్వారా ప్రజలకు మరింత సేవ చేయడంతో పాటు నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలను ప్రొత్సహించవచ్చని ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చొరవ తీసుకుని నల్లగొండ జిల్లాలోని పలు గ్రామాల్లో బెల్టు షాప్ లను తొలగింపజేయడం అభినందనీయని చిన్నా రెడ్డి అన్నారు.
రాష్ట్రంలో బెల్టు షాప్ నిర్మూళనకు మహిళలు ఉద్యమించాలని, తద్వారా ఆ వ్యాపారం చేసే వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించి వాటిపై తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. మహాదేవ్ విద్రోహి మాట్లాడుతూ అన్యాక్రాంతమవుతున్న భూదాన భూములను పరిరక్షించి భూదాన్ యజ్ఞ బోర్డుకు అప్పగించాలని, తద్వారా మిగిలిన ఉన్న భూదాన భూములను మూడేళ్లలో పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం భూదాన భూములను అర్హులైన పేదలకు, రైతులకు పంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వెదిరె అరవింద్ రెడ్డి మాట్లాడుతూ భూదాన ఉద్యమం అప్పటి దేశ రాజకీయాల పరిస్థితిని మర్చి వేసిందన్నారు. భూదాన ఉద్యమ స్ఫూర్తితో అమరుల వారసులు కూడా ముందుకు సాగాలని, ఇంకా మిగిలి ఉన్న భూదాన భూములను పేదలకు పంచేందుకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ ఎ.నరసింహారెడ్డి మాట్లాడుతూ భూదాన రామ చంద్రా రెడ్డి లాంటి వారు భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ ప్రజలకు న్యాయం చేసేందుకు ప్రగతిశీల ఆలోచనలు చేశారన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం వచ్చిన అనేక భూచట్టాలలో లోపాలు లేవని, వాటిని పటిష్టంగా అమలు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు 17,69,500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్యరీత్యా ఆదుకుంటుందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ సేవలు నిరంతరం అందించాలని కోరారు.

## లైసెన్సుల పేరిట
## ట్రేడ్ లైసెన్సు అధికారుల చేతి వాటం



**విశ్వంభర, దిల్సుఖ్ నగర్ :** ట్రేడ్ లైసెన్సులపై చిరు వ్యాపారులకు అవగాహన లేకపోవడం మలక్ పేట సర్కిల్ జిహెచ్ఎంసీ సిబ్బందికి వరంగా మారింది. వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సులు ఇవ్వకుండా సంబంధిత అధికారుల అండతో మామూళ్లతో జేబులు నింపుకుంటున్నారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సుకు అయ్యే సొమ్ము కంటే భారీగా మామూళ్ల కింద ఇవ్వాల్సి వస్తోంది. వ్యాపారులకు అవగాహన కల్పించి 24 గంటల్లోగా లైసెన్సు మంజూరు చేయాల్సిన సిబ్బందే.. మామూళ్లకు అలవాటుపడి రాష్ట్ర ఖజానాకు గండికొడుతున్నారు. మలక్ పేట సర్కిల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది అవినీతి చర్యలకు బాధిత వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులకు నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడుతూ మామూళ్లు వసూలు చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా సిబ్బందికి వత్తాసు పలుకుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ లోని గాయత్రి స్టడీ హాల్ నిర్వాహకుడు అభిరాం సిబ్బంది వేధింపులకు విసిగి ఏసిబీని ఆశ్రయించినా.. ఫలితం లేదని వాపోయారు. తక్కువ అమౌంట్ ఉంది కావున మేము ఏమి చేయలేమని, పెద్ద ఎత్తున అమౌంట్ అడిగితే ఏసీబీని సంప్రదించాలని అన్నారని దీనితో అభిరాంతో హాస్టల్ యజమాని మీడియాను ఆశ్రయించి గోడు వెళ్లబోసుకున్నారు.



## ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్ర పటాలకి పాలాభిషేకం

**విశ్వంభర, హైదరాబాద్ :** రెండు లక్షల రూపాయలు రైతు రుణమాఫీ అంశాన్ని గడపగడపకు తీసుకెళ్లాలని పిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రేపు మొదటి సారి లక్ష రూపాయలు వరకు రుణం తీసుకున్న రైతులందరికీ రుణ విముక్తులను చేసేందుకు ప్రభుత్వపరంగా ఆయా రైతు రుణ ఖాతాలలో నిధులు రేపు జమ చేయనుంది. నెలాఖరు లోపల లక్షన్నర రూపాయలు రుణం తీసుకున్న రైతులందరినీ రుణ విముక్తుల్ని చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా ఆగస్టు 15వ తేదీ లోపల రెండు లక్షల రూపాయల వరకు రుణం తీసుకున్న రైతులందరికీ ఏకకాలంలో ఆయా రైతు రుణ ఖాతాలలో నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, పిసిసి అధికార ప్రతినిధి లోకేష్ యాదవ్, గౌరీ సతీష్ ముఖ్యమంత్రికి పాలాభిషేకం చేశారు.

## ఆత్మగౌరవం ప్రతిఘటన విముక్తి

### 17 జూలై నుంచి 6 ఆగస్టు వరకు వాడవాడలో దళిత మృతవీరులను స్మరించుకుందాం

**విశ్వంభర, చిక్కడ్‌పల్లి :** గత నాలుగు దశాబ్దాలుగా మానకుండా సలుపుతున్న నెత్తుటి గాయం. కారంచేడు మాదిగలపై వందలాది మంది కమ్మకుల ఉన్మాదుల గుంపు దాడి చేసింది. కత్తులు, బరిసేలు, గొడ్డళ్ళతో మాదిగలను విచక్షణా రహితంగా నరికారు. ఆరుగురు యువకులు అక్కడికక్కడే మరణించారు. స్త్రీలు, వృద్ధులు, పసిపిల్లలనే తేడా లేకుండా అనేక మంది తలలు పగులగొట్టారు. కాళ్ళు, చేతులు తెగ్గోసారు. మహిళపై అఘాయిత్యాలకు పాల్పడ్డారు. ఇళ్లన్నీ తగులబెట్టారు. అందిన కాడికి దోచుకున్నారు. ఆర్థికంగా బలిసిన కమ్మ కులస్తులు గ్రామాధిపత్యాన్ని చెలాయిస్తూ BC, SC, ST తదితర పేద వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తుండేవారు. కమ్మలు స్థాపించిన తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చి NT రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత కమ్మోల్ల దౌర్జన్యాలు పరాకాష్టకు చేరాయి. దాడులకు గురయ్యే మాల, ఎరుకుల, సాయబు తదితర కులస్తులకు మాదిగ పల్లే అండగా ఉండేది. దాడి చేసిన కమ్మోల్లను మాదిగలు నిలదీసేవారు. కమ్మకులాధిపత్యాన్ని ప్రశ్నించే మాదిగల చైతన్యాన్ని అణచడం కోసం ఈ దాడి జరిగింది. 16 జూలై 1985 రోజున జరిగిన ఒక్క సంఘటను సాకు సాకుగా తీసుకుని ఇంతటి నరమేధానికి పాల్పడ్డారు. మాదిగల తాగు నీటి చెరువులో ఒక కమ్మ యువకుడు గేదెలను దించి, కుడితి తట్టలను కడిగిన నీటిని కలుషితం చేశాడు. "తాగే నీటిని కలుషితం చేస్తున్నవేంటి..ష అని అక్కడే ఉన్న చంద్రయ్య అనే దళిత యువకుడు ప్రశ్నించాడు. మాదిగ యువకుడి ప్రశ్నను సహించలేని కమ్మకులస్తుడు అతన్ని చెన్న కొలతో కొట్టి కులం పేరుతో దుషించాడు. అప్పుడే మంచి నీళ్ళ కోసం వచ్చిన మున్నంగి సువార్ధమ్మ అతన్ని వారించింది. నీటిని కలుషితం చేసింది కాకుండా వికలాంగుడు మీద దాడి చేస్తున్నావ్.. నువు మనిషివేనా" అని తిట్టింది. దాంతో వాడు సువార్థమ్మను కూడా చెర్నాకోలతో కొట్టాడు. సువార్తమ్మ నీళ్ళ బిందెను ఎత్తి వాణ్ణి కొట్టింది. అంతే ఒక మాదిగ స్త్రీ కమ్మోలను కొట్టిందనే వార్తను సహించలేక మాదిగలందరికి గుణపాఠం చెప్పాలనే కక్షతో ఇంతటి నరమేధానికి పూనుకున్నారు. కారంచేడు దళిత



మృతవీరుల సంస్మరణ సభలో వారికి నివాళులు.

23 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో విజయం సాధించిన బాధితులు, ఏమాత్రం రాజీలేని పోరాటాన్ని నడిపి దేశమ్ మొత్తం కారంచేడు వైపు చూసేలా చేసిన బాధితుల పోరాటం వలన 30 అక్టోబర్ 1994 న జిల్లా కోర్టులో దోషులకు శిక్ష పడింది. కానీ బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద కింద 24 జూలై 1998వ హైకోర్టు కేసును కొట్టేసింది. కానీ ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాజీపడని బాధితులు సుప్రీం కోర్టుకి వెళ్ళారు. పదేళ్ల తర్వాత 19 డిసెంబర్ 2008న సుప్రీంకోర్టు దోషులకు శిక్షలు వేసింది. ప్రధాన ముద్దాయి అంజయ్యకు జీవిత ఖైదు విధించింది. 29 మందికి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఆత్మగౌరవం కోసం అగ్రకులోన్మద శక్తులతో తలబడుతూ దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన పోరులో ఓరిగిపోయిన దళిత మృత వీరులను తలుచుకుంటూ 17 జూలై (కారంచేడు) నుండి 6 ఆగస్టు (చుండూరు) వరకు వాడవాడలో దళిత మృత వీరుల సంస్మరణ సభలు జరపాలని కుల నిర్మూలనా పోరాట సమితి (KNPS) పిలుపునిస్తున్నది. అందులో భాగంగా 17 జూలై 2024 రోజున హైదరాబాద్లో జరుపుతున్న కారంచేడు దళిత మృత వీరుల సంస్మరణ సభలో ప్రజలు, దళిత,బహుజన, ప్రజాసంఘాలు పెద్దెత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కులనిర్మూలనా పోరాట సమితి (KNPS) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభినవ్ బూరం పిలుపునిచ్చారు.

## మాట ఇచ్చాం నిలబెట్టుకుంటున్నాం

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం :** కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఏకకాలంలో పంట రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, నేడు ఇచ్చిన మాట ప్రకారం ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేస్తున్నాం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సుమారు రూ 31 వేల కోట్ల రైతుల పంట రుణమాఫీని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సాక్షిగా ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ప్రకటించిన తేదీ లోపే సంపూర్ణంగా రుణమాఫీ చేస్తాం అని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. రైతును రాజు చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, గత ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయంలో చేసిన రుణ మాఫీ రైతులకు మిత్తిలకు కూడా సరిపోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉంటేనే రుణమాఫీ వర్తిస్తుంది అన్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు అమలు పరుస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని త్వరలోనే రేషన్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మడం లేదని ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని పేర్కొన్నారు.

## నేడు చైతన్యపురిలో నెల్సన్ మండేలా జయంతి

**విశ్వంభర, చైతన్యపురి :** గురువారం ఉదయం 11.00 గంటలకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో , చైతన్యపురిలోని V3 ఛానల్ సమీపానగల హాలులో ప్రపంచ శాంతి ఉద్యమ యోధుడు, నల్లజాతి సూర్యుడు నెల్సన్ మండేలా గారి జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కే.వీ.ఎల్. రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కొత్వాల్ ఓబేదుల, కాచం సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం, సమాజ మార్పు కోసం ఆయన చేసిన పోరాటాల నుండి స్ఫూర్తి పొందుదాలని, అందుబాటులో ఉన్న AIPSO నాయకులు, శ్రేయోభిలాషులు, తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు.



తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్.

- విశ్వంభర, హైదరాబాద్



తొలి ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, బుధవారం కూకట్ పల్లి రామాలయంలో శ్రీ సీత రామచంద్ర స్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలతో ఎమ్మెల్యేని ఆశీర్వచనం చేసి, సన్మానించారు. ఆయన వెంట కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, చైర్మన్ తులసి రావు తదితరులు ఉన్నారు.

- విశ్వంభర, కూకట్ పల్లి



పవిత్రమైన ఆషాఢ తొలి ఏకాదశిని పురస్కరించుకుని గౌలిగూడ జంగల్ విటోభ దేవాలయానికి బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణరావు కుటుంబ సమేతంగా వెళ్లి దర్శించుకున్నారు. అర్చన అనంతరం మహా హారతి తీసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎన్ ఆర్ లక్ష్మణ్ రావు బజరంగసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భార్య కిరణ్ రావు, కూతురు దీక్షిత లతో కలిసి దర్శించుకున్నారు.

- విశ్వంభర, హైదరాబాద్

## చెడు వ్యసనాలకు డ్రైవర్లు దూరంగా ఉండాలి


### చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎంఓ బాబు నాయక్

**విశ్వంభర, ముషీరాబాద్ :** ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎంవో బాబు నాయక్ అన్నారు.
బుధవారం ముషీరాబాద్ బస్ డిపోలో చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆరంభగ బాబు నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లకు డ్రైవర్లకు నగదు పారితోషకాన్ని అందించారు. ఆర్టీసీ ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు మ్యూజికల్ చైర్స్ షటిల్ బ్యాట్మెంటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రశంస పత్రాలను అందజేశారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ. డిపో అభివృద్ధి కోసం ఆర్టీసీ లాభాల్లో తీసుకొచ్చేందుకు అందరు కృషి చేయాలన్నారు. ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కళ్యాణి, ఏఎంఈ చందర్, ఏఎంపీ జ్యోతిక, తదితరులు పాల్గొన్నారు.

పాత బస్తీలోని మీరాలం మండి వద్ద మొహర్రం ఊరేగింపులో భాగంగా బీబీకా అలాంకు దట్టి సమర్పిస్తున్న తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు తదితరులు.

- విశ్వంభర, హైదరాబాద్





తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్‌పర్సన్‌గా పదవి బాధ్యత స్వీకరించిన నిర్మల జగ్గారెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదలను ఆదర్శ కిరణం సంపాదకులు వంగాల బాలరాజు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షురాలు గడ్డమీది అనురాధ గౌడ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. చిత్రంలో చొప్పదండి సత్యనారాయణ గౌడ్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- విశ్వంభర, బషీర్‌బాగ్



ముషీరాబాద్‌లోని హస్తకళా భవన్లో హ్యాండ్ క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాయడు సత్యనారాయణ గౌడ్ గారి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని ఆయనకు హార్ధిక శుభాకాంక్షలు తెలుపుతున్న రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.

- విశ్వంభర, ముషీరాబాద్



హైదరాబాద్లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని పరామర్శించి, ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వారి వెంట ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ తదితరులు.

- విశ్వంభర, హైదరాబాద్



## వ్యవసాయం దండగ కాదు పండగ

### ఇది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ విధానం

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం, ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని రైతులందరికీ ఒకే విడతలో రెండు లక్షల రుణమాఫీ చేస్తూ ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించబోతున్నారు. దేశ చరిత్రలో ఒకేసారి 31 వేల కోట్ల రైతురుణమాఫీ చేసిన రికార్డు మన ప్రభుత్వం సొంతం కాబోతుంది. కావున ఇంత గొప్ప కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొని రుణమాఫీ సంబరాలలో పాల్గొని రైతుల్లో విశ్వాసం నింపవలసిందిగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పత్రికలకు విడుదల చేసిన ప్రకటన ద్వారా కోరారు.

## అరెస్టులు అప్రజాస్వామికం





**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండలం కేంద్రంలో కేజీబీవీ గురుకుల పాఠశాల భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్న పలువురు కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , ప్రజాప్రతినిధులను అడ్డుకుంటారని భయంతోటీ, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సజావుగా సాగనీవారనే నెపంతో(సాకుతో) బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కడ్తాల్ మండలం రావిచేడ్ మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, మరియు రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని అని మాజీ ఎంపీటీసీ గోపాల్ అన్నారు. ఇది ప్రజాస్వామ్యమా, లేక కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యమా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే పాఠశాల భవనం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు 250 మంది విద్యార్థులు తరగతులు జరగనివ్వకుండా, పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ ప్రారంభోత్సవం పేరుతో నెలలకు నెలలు కాలయాపన చేసి పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బడుగు, బలహీన వర్గాలు, పేద విద్యార్థులు చదివేటటువంటి అన్ని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, సరైనవసతులుకల్పించాలని, ఉపాధ్యాయులను నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల నిరసనలు




**విశ్వంభర, కేశంపేట :** సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రారంభమైన మధ్యాహ్న భోజన కార్మిక రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, మేస్చార్జీలు ఇవ్వకపోవడం కోడిగుడ్డు బిల్లులు గత ఆరు నెలలుగా ఇవ్వకపోవడం కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని ప్రభుత్వంలోకి రాకముందు రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని 10,000 వేతనాన్ని ఇస్తామని ప్రకటించిన సీఎం గారు ఆ దిశగా ఇప్పటివరకు జీవో జారీ చేయలేదని కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని, ఆరు నెలలుగా పేద పిల్లలకి వడ్డిస్తే ఇప్పటివరకు జీతాలు ఇవ్వకపోవడం ఎంతవరకు న్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, మన్నా లాంటి స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజనాన్ని అప్పజెప్పే యోచనను విరమించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రభుత్వం మెడలు వంచి వారి డిమాండ్లను సాధించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు రాములు, సత్తెమ్మ, యాదమ్మ, సబిత, జంగమ్మ, నిర్మల, కైరున్ బాలమణి, కళావతి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమాకమైన నేరెళ్ల శారదను హైదరాబాద్ లోని మహిళ కమిషన్ కార్యాలయంలో బుధవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జూకల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆమెను కలిసి అభినందించారు.

- విశ్వంభర, నారాయణఖేడ్

# రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

○ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు


**విశ్వంభర, భూపాలపల్లి :** రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. గణపురం మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో రూ.178.66 లక్షలతో ఊర చెరువు కట్ట అభివృద్ధి పనులను పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ చెరువు కట్ట వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాగా, ఉదయం వర్షంలో తడుస్తూనే ఎమ్మెల్యే జీఎస్సార్ ట్రాక్టర్ పై చెరువు కట్ట పైకి వెళ్లారు. అనంతరం భూపాలపల్లి రూరల్ మండలం ఎస్ఎం కొత్తపల్లి గ్రామంలో రూ.210.94 లక్షలతో దోమర్లపల్లి చెరువు కట్ట అభివృద్ధి పనులను పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ చెరువును ప్రారంభించారు. అనంతరం రేగొండ మండలం మడతపల్లి గ్రామంలో రూ.150.00 లక్షలతో పెద్ద చెరువు కట్ట పనులను పూర్తి చేసుకున్న సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కొత్తపల్లి గోరి మండలం చిన్నకోడెపాక గ్రామంలో రూ.363.80 లక్షలతో పెద్ద చెరువు కట్ట పనులు చేసిన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

భూపాలపల్లి పట్టణ శివారులోని సిపిఐ గుడిసెవాసులు నివాసం ఉంటున్న ప్రాంతంలో రూ.2 లక్షల వ్యయంతో నూతనంగా డ్రిల్లింగ్ చేసిన బోరును ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై, స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి లోని మంజూరునగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శివ మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై, కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గణపురం మండలం జంగుపల్లి, కొత్తపల్లిగోరి మండలం జంషెడ్ బేగ్ పేట గ్రామంతో పాటు కొత్తపల్లి



గోరి మండల కేంద్రంలో జరిగిన మొహర్రం వేడుకల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యేకు ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మసీదులో పీరమ్మల వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయ కొట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ, ముస్లింలందరూ సోదరుల్లా కలిసి ఉండాలన్నారు. త్యాగాలకు ప్రతీక మొహర్రం పండుగ అని రాష్ట్రవ్యాప్తంగా జరుపుకోవడం సంతోషకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దంపతుల తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, చౌటుప్పల్ :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు మునుగోడు నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, నియోజక వర్గ ప్రజలకు తొలిఏకాదశి శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయురారోగ్యాలతో సుఖ శాంతులతో ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించానని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అనంతరం ఆందోల్ మైసమ్మ దేవస్థానం 19వ బోనాల ఉత్సవ ఆహ్వాన గోడపత్రికను ఆవిష్కరించారు.. తెలంగాణలోనే మొట్టమొదటి శ్రీ మహావిష్ణువు ఆలయాన్ని ఎమ్మెల్యే చౌటుప్పల్ మండలం దేవులమ్మ నాగారం గ్రామంలో 13వ శతాబ్దపు చారిత్రక ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు.ఆ తర్వాత చండూరు మండలం చామలపల్లి గ్రామంలో జరుగుతున్నా శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి జాతర కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి లక్ష్మి దంపతులు పాల్గొనడం జరిగింది.పలు దేవాలయాలు సందర్శించిన ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించి వేద ఆశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు , ప్రజా ప్రతినిధులు,ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి



**విశ్వంభర, కరీంనగర్ :** కరీంనగర్‌లోని ఒక హోటల్ లో మెండి చంద్రశేఖర్ (మార్షల్) గారు పలువురు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ (మార్షల్) మాట్లాడుతూ.. కిసాన్ నగర్ లోని వ్యవసాయ మార్కెట్ లో ఇంటిగ్రెటెడ్ మార్కెట్ లో షెడ్ మరియు గద్దె లను తొలగించడం పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ మరియు మున్సిపల్ ప్రజాప్రతినిదులు, సిబ్బంది అదనంగా రాక్ కటింగ్ పేరుతో రూ.80 లక్షలు బిల్లు రికార్డు చేసుకొని తీసుకున్నారని తెలిపారు. గాంధీ రోడ్ కూడలిలో మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు పనుల్లో భాగంగా 45 ఫీట్ల బోర్ కేసింగ్ వేసి 150 ఫీట్లు బిల్లు రికార్డు చేసుకున్నారు. ఏ బోర్ కైనా 150 ఫీట్ల కేసింగ్ ఉండదు. ఇదెలా రికార్డు అయిందని ప్రశ్నించారు. దీనికి అదనంగా 90 లక్షల బిల్లులు వేసినారు ,గాంధీచౌరస్తాలో మహాత్మాగాంధీ విగ్రహం మొదటి సారి స్థాపించి తొలగించగా మరొక విగ్రహం కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. మొదట కొనుగోలు చేసిన విగ్రహం ఎక్కడ ఉంది. దీని బిల్లు ఎవరు భరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ పనులు ప్రారంభమైనప్పటి నుంచి కొన్ని అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు పొంది, తిరిగి సీఎం అష్యూరెన్స్ పథకం కింది కూడా అవే పనులకు బిల్లులు రికార్డు చేస్తున్నారని, ఈ అవినీతిలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాత్ర ఉందని తేల్చి చెప్పినారు. స్మార్ట్ సిటీ అవినీతి పనులపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి అందజేసిన లేఖ ద్వారా కోరినారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రకాష్, గంట శ్రీనివాస్, వైద్యుల అంజన్ కుమార్, ఆకుల నరసయ్య, కాశెట్టి శ్రీనివాస్, పడిశెట్టి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

**విశ్వంభర, షాద్‌నగర్ :** ఫరూఖ్‌నగర్ మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు, షాద్ నగర్ పట్టణ ఆర్యవైశ్య సలహా సంఘం సభ్యులు, నవాబుపేట్ మండల రేషన్ డీలర్ మాజీ అధ్యక్షుడు ఎల్కూర్తి నారాయణ మరియు షాద్‌నగర్ యువనేత మధు జన్మదినం పురస్కరించుకుని షాద్‌నగర్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పలువురు మాట్లాడుతూ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకింగ్ వచ్చే ప్రతి ఒక్కరికి ఈ విధంగానే గౌరవం ఉంటుందన్నారు. నడక చాలా మంచిదని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం ఉదయపు నడక చేపట్టాలని అన్నారు.

కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సలహా సంఘం సభ్యులు దిడ్డి గోపాల్, విలేకరులు వేణు, సరాపు రమేష్, డాక్టర్ సురేష్, మధురాపూర్ గుండ్రాతి బాలరాజ్ గౌడ్, చెరుకుపల్లి శ్రీనివాస్, అడ్వకేట్ శ్రీనివాస్ రియల్ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త రాజు గౌడ్, స్వాతి బుక్ శివ, చెరుకుపల్లి సురేష్, పద్మనాభం డాక్టర్, నారాయణ సార్, అడ్వకేట్ శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు చేరుకుపల్లి సురేష్, కొనియళ్ల భాస్కర్, గంధం సురేందర్, రాముగారి గోపీనాథ్, బానూరి రామ్ మోహన్, సంగమేశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.





## వెంకటేశ్వర ఆలయంలో భక్తుల సందడి

**విశ్వంభర, ఆమనగల్లు :** శయన ఏకాదశి సందర్భంగా ఆమనగల్లు అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆషాడ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశి కి అత్యంత విశిష్టత ఉంది.శ్రీ మహావిష్ణువు ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగ నిద్రలో ఉండడంతో తొలి ఏకాదశి శైన ఏకాదశి కూడా అంటారు. ఏకాదశి శ్రీమహావిష్ణువు ఎంతో ప్రీతిపాత్రమైనది. బుధవారం ఏకాదశి సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని శ్రీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు ఆలయ పూజారి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు.

## కడ్తాల్ మాజీ జడ్పీటీసీ అరెస్ట్



**విశ్వంభర, ఆమనగల్లు :** అక్రమ అరెస్టులతో ప్రజా గొంతుకలను ఆపలేరు. అని కర్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మంత్రులతో ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి కస్తూర్బా పాఠశాలను మండల కేంద్రానికి మంజూరు చేయించి పూర్తి పనులు చేసామని తన పదవి చివరి రోజు కూడా కేజీబీవీ పాఠశాల గురించి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాఠశాలలో నెలకొన్న కరెంటు సమస్యను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించిన తనను పాఠశాలను ఎలాగైనా ప్రారంభించాలని నిరాహార దీక్షకు ఇచ్చామని అలాంటిది తాను ఎందుకు ప్రారంభాన్ని అడ్డుకుంటానని అన్నారు. పోలీసులు తన నివాసంలో అక్రమ అరెస్టుకు పాల్పడడం ఇది అప్రజాస్వామికమని, ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

## ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**విశ్వంభర, నారాయణఖేడ్ :** తొలి ఏకాదశి సందర్భంగా నారాయణఖే నియోజకవర్గంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పెద్ద శంకరంపేట కేంద్రంలో వెంకటేశ్వర స్వామి దేవాలయం విఠలేశ్వర మందిరంలో భక్తులు ఉదయం నుంచి స్వామివారి దర్శనానికి పోటెత్తారు.. ఆషాడ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశికి అత్యంత విశిష్టత ఉంది.. ఏడాది ప్రారంభానికి సూచికగా తొలి ఏకాదశిని వివరిస్తూ పురాణాలు చెబుతున్నాయి. శ్రీ మహావిష్ణువు ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగ నిద్రలో ఉండడంతో తొలి ఏకాదశి శైన ఏకాదశి కూడా అంటారు.. ఏకాదశి శ్రీమహావిష్ణువు ఎంతో ప్రీతిపాత్రమైనది. బుధవారం ఏకాదశి సందర్భంగా పెద్ద శంకరంపేట కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, రుక్మిణి పాండురంగ సమేత విఠలేశ్వర ఆలయాలలో వేద బ్రాహ్మణ పండితులచే ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆయా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు.





## వారు ఎప్పుడూ నిరసన చేయరు..
# కాని మైండ్ గేమ్ ఆడుతారు
### దిగ్విజయ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు

**జబల్‌పూర్:** ఆర్ఎస్ఎస్‌ని వ్యతిరేకించే కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్, ఆ సంస్థను పొగిడారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్, సంస్థాగత విస్తరణపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)ని చూసి నేర్చుకోవాలని ఆ పార్టీ యూత్ కార్యకర్తలకు సూచించారు. బుధవారం మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లో నీట్ పేపర్ లీకులపై జరిగిన నిరసనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆర్ఎస్ఎస్ తమకు బద్ధ ప్రత్యర్థి అయినప్పటికీ ఆర్ఎస్ఎస్ నుంచి నేర్చుకోండి. వారు మైండ్ గేమ్ ఆడుతారు. వారు ఎప్పుడూ నిరసన చేయరు, ప్రదర్శనలు చేయరు, ఎప్పటికీ వారు లాఠీఛార్జిలను ఎదుర్కోరు, జైళ్లకు వెళ్లరు అని అన్నారు. కానీ వారు మనల్ని జైలుకి పంపుతారు" అని దిగ్విజయ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అట్టడుగు స్థాయిలో సంస్థాగత నెట్వర్క్ లేకుంటే నిరసనలు ప్రభావంతంగా ఉండవని ,బూత్ నుంచి జిల్లా వరకు మూడు స్థాయిల్లో ఆందోళనలు నిర్వహించాలని సూచించారు. "ఆర్ఎస్ఎస్ సాధారణంగా మూడు విషయాలపై దృష్టిపెడుతుంది. కరపత్రాలను పంపిణీ చేస్తుంది. చర్చలు నిర్వహిస్తుంది. చివరకు ఉద్యమాన్ని నిర్మిస్తుంది. మీరు వారితో పోరాడాలంటే, వారి సొంత ఆటలో వారిని ఓడించాలి. శారీరకంగా కాదు మేధోపరంగా ఆట సాగాలి" అని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యనిర్వహణ మరియు ప్రచారాన్ని అర్థం చేసుకోవడం ద్వారా సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కేజ్రీవాల్ పిటిషన్‌లపై ముగిసిన వాదనలు...
# తీర్పు రిజర్వ్ చేసిన ఢిల్లీ హైకోర్టు

**ఢిల్లీ:** మద్యం పాలసీ కేసులో తనను అరెస్ట్ చేయడంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. అరెస్ట్‌ను సవాల్ చేసిన పిటిషన్‌తో పాటు మధ్యంతర బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును కూడా ఢిల్లీ హైకోర్టు రిజర్వ్ చేసింది. ఈ పిటిషన్లపై కోర్టులో వాదనలు ముగిశాయి. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను జులై 29కి వాయిదా వేసింది. కేజ్రీవాల్ తరపున అభిషేక్ మనుసింఘ్వీ, విక్రమ్ చౌదరి, సీబీఐ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీపీ సింగ్ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి అని... ఉగ్రవాది కాదని ఆయన తరపు న్యాయవాది అన్నారు. కొన్ని నెలలుగా జైల్లో ఉన్నా ఆయనను సీబీఐ అరెస్ట్ చేయలేదని.. ఈడీ కేసులో ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన వెంటనే ఆయన్ని అరెస్ట్ చేసిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు సైతం మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసిందని.. ఆ తర్వాత లొంగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తర్వాత ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిందని.. కోర్టు నిర్ణయం కచ్చితంగా సరైందే అన్నారు. కేజ్రీవాల్ ఎక్కడకూ పారిపోవడం లేదన్నారు. తప్పుడు కేసులో ఆయనను అరెస్ట్ చేశారని ఆరోపించారు. విచారణకు కేజ్రీవాల్ ఎప్పుడూ సహకరిస్తూ వచ్చారన్నారు. నిద్రపోతున్న సమయంలో కేజ్రీవాల్ షుగర్ లెవల్స్ ఐదుసార్లు పడిపోయాయని.. ఇది ఆందోళన కలిగించే అంశమన్నారు. నిద్రపోతున్న సమయంలో షుగర్ లెవల్స్ తగ్గడం ప్రమాదకరమన్నారు. ఈ కేసులో అందరికీ బెయిల్ వచ్చిందని, కేజ్రీవాల్‌కు మాత్రం రాలేదన్నారు. వాస్తవాలను పరిశీలించి బెయిల్‌ను మంజూరు చేయాలని కోరారు. కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు చట్టం ప్రకారం అనుమతి అవసరమని సీబీఐ తరపు న్యాయవాది డీపీ సింగ్ వాదించారు. ఈ కేసులో జనవరిలో సాక్షిగా మారిన మాగుంట వాంగ్మూలం ఇచ్చారని పేర్కొన్నారు. అంతకుముందు ఏం చేయలేదన్నారు. దర్యాప్తు సంస్థగా సీబీఐకి సొంత హక్కులు ఉన్నాయని.. ఏ నిందితుడిపై ఛార్జిషీట్‌ను ఎప్పుడు దాఖలు చేయాలి.. ఏ నిందితుడిని ఎప్పుడు పిలవాలో నిర్ణయించే హక్కు ఉందని పేర్కొన్నారు.



## నీట్ యూజీ కి సంబంధించిన పిటిషన్లను
## నేడు విచారించనున్న సుప్రీంకోర్టు



**ఢిల్లీ:** ఇటీవల జరిగిన నీట్‌యూజీ 2024 ఎగ్జామ్ దేశవ్యాప్తంగా పెద్ద సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి పిటిషన్లను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గురువారం విచారించనుంది.వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను బదిలీ చేయాలని కోరుతూ ఎన్‌టీఏ దాఖలు చేసిన వాటితో సహా 40కి పైగా పిటిషన్‌లను ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్‌లు మనోజ్ మిశ్రా,జెబి పార్దివాలాలతో కూడిన ధర్మాసనం విచారిస్తుంది. జులై 11నే ఈ పిటిషన్లపై విచారించాల్సి ఉండగా, కొంతమంది పిటిషనర్ల తరపున న్యాయవాదులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దాఖలు చేసిన అఫిడవిట్లను అందుకోలేదని, వాటి పరిశీలన నిమిత్తం సమయం ఇస్తూ విచారణను జులై 18కి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లను గురువారం విచారిస్తుంది. మరోవైపు పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ తన నివేదికను కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. పేపర్ లీక్ బీహార్‌లోని ఒక్క పరీక్ష కేంద్రానికే పరిమితం అయిందని పేర్కొంది. కేంద్రం కూడా 2024 25 సంవత్సరానికి గానూ కౌన్సిలింగ్ ప్రక్రియను జులైమూడో వారం నుంచి 4 రౌండ్లలో నిర్వహిస్తామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.

## రష్యాఉక్రెయిన్ యుద్ధంలో బీహార్ బూట్లు

**పాట్నా :** గత రెండేళ్లుగా రష్యా... ఉక్రెయిన్‌పై దాడులు కొనసాగిస్తూనే ఉంది. కాగా, ఈ యుద్ధంలో రష్యా సైనికులు ఉపయోగిస్తున్న బూట్లు మనదేశంలోని బీహార్ రాష్ట్రంలో తయారవుతున్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. బీహార్‌లో రాజధాని పాట్నా తర్వాత బాగా అభివృద్ధి చెందుతున్న నగరం హాజీపూర్. ఈ పట్టణం పాదరక్షల తయారీకి ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారయ్యే నాణ్యమైన పాదరక్షలకు అంతర్జాతీయంగా పేరుంది. అందుకే, రష్యా సైన్యం తమ సైనికుల కోసం హాజీపూర్ బూట్లనే వినియోగిస్తోంది. హాజీపూర్‌లోని కాంపిటెన్స్ ఎక్స్ పోర్ట్స్ కంపెనీ... రష్యా సైనికులకు బూట్లు సరఫరా చేసేందుకు రూ.100కోట్ల ఆర్డర్ పొందడం మామూలు విషయం



కాదు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆర్మీల్లో రష్యా సైన్యం కూడా ఒకటి. రష్యన్ సైనికులు ఉపయోగించే ఆయుధాలు కానీ, సాంకేతిక పరికరాలు కానీ, వారి యూనిఫాం, ఇతర ఉపకరణాలు కానీ నాణ్యతా ప్రమాణాల పరంగా ఏమాత్రం రాజీపడరు. అందుకే, రష్యా ఆర్మీ బూట్ల తయారీకి పేరెన్నికగన్న హాజీపూర్ లో తమ సైనికులకు బూట్లు తయారు చేయిస్తోంది. బీహార్ బూట్లు ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకునేలా రూపొందిస్తారు. ఇవి తేలిగ్గా ఉండడమే కాదు, మైనస్ 40 డిగ్రీల అత్యంత శీతల వాతావరణంలోనూ సౌకర్యవంతంగా ఉంటాయి. గతేడాది కాంపిటెన్స్ ఎక్స్ పోర్ట్స్ కంపెనీ 15 లక్షల మిలిటరీ గ్రేడ్ బూట్లను రష్యాకు ఎగుమతి చేసింది. తమ బూట్లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా... కాంపిటెన్స్ కంపెనీ ప్రజల వినియోగం కోసం డిజైనర్ షూ తయారు చేసి యూరప్ మార్కెట్లో విడుదల చేయాలని భావిస్తోంది.

## ఎన్టీఏ నుంచి నీట్ పేపర్
## దొంగిలించిన మాస్టర్‌మైండ్ అరెస్ట్





**ఝార్ఖండ్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పేపర్ లీక్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పేపర్ లీక్ ప్రధాన నిందితుడిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఝార్ఖండ్ హజారీబాగ్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నుంచి ప్రశ్నాపత్రాన్ని దొంగిలించిన పంకజ్ కుమార్ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడితో పాటు పేపర్ లీక్కు సహకరించిన మరో వ్యక్తిని అరెస్ట్ చేయడంతో ఇప్పటివరకు పేపర్ లీక్ కేసులో అరెస్టైన వారి సంఖ్య 14కు చేరింది. నిట్ జంషెడ్పుర్లో 2017 బ్యాచ్ సివిల్ ఇంజినీర్ అయిన పంకజ్ కుమార్ హజారీబాగ్లోని ఎన్టీఐ ట్రంక్ పెట్టెల నుంచి నీట్ ప్రశ్నాపత్రాన్ని దొంగిలించాడని సీబీఐ అధికారులు తెలిపారు. అనంతరం రాజు సింగ్ అనే వ్యక్తికి అందజేయగా, అతడు తన గ్యాంగ్ సభ్యులకు చేరవేశాడని.. ఈ నేపథ్యంలోనే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. బొకారోకు చెందిన పంకజ్ కుమార్ను బిహార్ రాజధాని పట్నాలో అరెస్ట్ చేయగా, రాజును హజారీబాగ్లో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఆరు ఎఫ్ఐఆర్‌లను సీబీఐ అధికారులు నమోదు చేశారు. ఆరు ఎఫ్ఐఆర్‌లను సీబీఐ అధికారులు నమోదు చేశారు.




## సౌత్‌లో తొలి డబుల్ డెక్కర్
# ఫ్లైఓవర్ ప్రారంభం

**బెంగళూరు :** దక్షిణ భారతదేశంలో తొలి డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ కర్ణాటకలో ప్రారంభమైంది. రూ.449 కోట్లతో బెంగళూరులో నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించారు.సౌత్ ఇండియాలో తొలి డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌గా రికార్డు సృష్టించింది. 3.36 కిలోమీటర్ల పొడవైన ఈ ఫ్లైఓవర్.. సిల్క్ బోర్డు జంక్షన్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ట్రాఫిక్‌ను సులభతరం చేయనుంది. వాహనాల రాకపోకల కోసం ఎగువ డెక్‌లో ఎలివేటెడ్ మెట్రో కారిడార్ మరియు దిగువ డెక్‌లో ఎలివేటెడ్ రోడ్డును కలిగి ఉంది.ఫ్లైఓవర్ రోడ్డు మరియు మెట్రో ఫ్లైఓవర్ కలిగి ఉంది. సౌత్ ఇండియాలో ఇలాంటి డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించడం ఇదే తొలిసారి. ఈ ఫ్లైఓవర్ రాగిగుడ్డ మెట్రో స్టేషన్‌లో ప్రారంభమై సిల్క్‌బోర్డ్ జంక్షన్‌లో ముగుస్తుంది. ఫ్లైఓవర్‌తో పాటు వెళ్లే పసుపు లైన్ మెట్రో పనులు ఇంకా పూర్తికాలేదు. అయితే బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకారం ఇది ఈ సంవత్సరం డిసెంబర్‌లో ప్రారంభమవుతుంది. ఇక నగరంలోని ఏ వైపు నుంచి అయినా 3040 నిమిషాల సమయం ఆదా అవుతుంది. రెండు ర్యాంప్‌ల నిర్మాణం మే 2025 నాటికి పూర్తి అవును.

## బ్రిటన్ నుంచి భారత్ చేరుకున్న
## ఛత్రపతి శివాజీ ఆయుధం



**ముంబై :** వీర మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ యుద్ధ సమయాల్లో ఉపయోగించే ప్రత్యేకమైన ఆయుధం... వాఘ్ నఖ్. ఇది పులి పంజా ఆకారంలో ఉంటుంది. లోహంతో తయారైన వాఘ్ నఖ్‌ను చేతికి ధరించి ఎదుటి వ్యక్తి శరీరాన్ని చీల్చివేయవచ్చు. 1659లో బీజాపూర్ సామ్రాజ్య సైన్యాధిపతి అఫ్జల్ ఖాన్‌ను చంపడానికి శివాజీ ఈ వాఘ్ నఖ్‌ను ఉపయోగించాడని చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో ఈ చారిత్రక వస్తువు బ్రిటన్‌కు చేరింది. లండన్ లోని ప్రఖ్యాత విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో దీన్ని ప్రదర్శనకు ఉంచారు. అయితే, అనేక ప్రయత్నాలు చేసిన మీదట, వందల ఏళ్ల తర్వాత ఈ ఆయుధం తిరిగి భారత్ చేరుకుంది. బుల్లెట్ ప్రూఫ్ కవర్ లో ఉంచి ఈ ఆయుధాన్ని భద్రంగా భారత్ కు తీసుకువచ్చారు. శివాజీ ఉపయోగించిన ఈ వాఘ్ నఖ్ లండన్ నుంచి ముంబయి చేరుకున్నట్టు మహారాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి సుధీర్ మునిగంటివార్ వెల్లడించారు. సతారాలోని ఛత్రపతి శివాజీ మ్యూజియంలో ఈ వాఘ్ నఖ్‌ను ఏడు నెలల పాటు ప్రదర్శనకు ఉంచుతున్నామని వివరించారు.



## కన్యాదానం అర్థాన్ని వివరించిన
# నీతా అంబానీ

**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ తన చిన్న కుమారుడు అనంత్ అంబానీ రాధికా మర్చంట్ వివాహ వేడుకలో 'కన్యాదానం' అర్థాన్ని వివరించారు. ఆమె మాటలకు అంబానీ కుటుంబసభ్యులతో పాటు అతిథులు కూడా ఎమోషనల్ అయ్యారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "హిందూ సంప్రదాయంలో కన్యాదానం అనేది చాలా గొప్పది. కానీ ఓ కుమార్తె కొన్ని సంవత్సరాలుగా తన కుటుంబంతో పంచుకున్న అనుబంధాన్ని, ఆప్యాయత నుంచి ఎలా దూరం కాగలదు? పుట్టింటి బంధం శాశ్వతంగా ఉంటుంది. కుమార్తె ఆస్తి కాదు ఒకరికి బదిలీ చేయడానికి..! ఆమె మన కుటుంబానికి దక్కిన ఆశీర్వాదం. కన్యాదానానికి నిజమైన అర్థం ఏంటంటే.. వధువు తల్లిదండ్రులు వరుడిని తమ కుమారుడిగా అంగీకరించడం.. అమూల్యమైన తన కుమార్తెను అతడి కుమారుడి చేతుల్లో పెట్టడం..! నేను కూడా ఓ కుమార్తెనే.. ఒక అమ్మాయికి తల్లిని, అత్తను కూడా. ఆడపిల్లలు లక్ష్మీ స్వరూపులు. వారు పుట్టగానే అష్టైశ్వర్యాలు లభిస్తాయి. కుటుంబాలు సంతోషమనే వెలుగులతో విరాజిల్లుతాయి'' అని నీతా వివరించారు.

## ప్రైవేట్ సంస్థల్లో కన్నడిగులకే 100%రిజర్వేషన్
## సీఎం సిద్ధరామయ్య

**బెంగళూరు:** రిజర్వేషన్లపై కర్ణాటక సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు సంస్థల్లోని గ్రూప్‌సీ, గ్రూప్‌డీ పోస్టులను 100 శాతం కన్నడ వాసులతోనే భర్తీ చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. మంత్రివర్గ సమావేశంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. "రాష్ట్రంలో నెలకొల్పిన అన్ని ప్రైవేట్ సంస్థల్లో గ్రూప్‌సీ, గ్రూప్‌డీ పోస్టులకు సంబంధించి 100% కన్నడిగుల నియమకాన్ని తప్పనిసరి చేసే బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది." అని సిద్ధరామయ్య పోస్టులో పేర్కొన్నారు. కన్నడిగులకు సొంత రాష్ట్రంలోనే ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వం ఉద్దేశమని తెలిపారు. కన్నడిగుల సంక్షేమమే తమ ప్రాధాన్యతని వెల్లడించారు. ఈ బిల్లును ఇవాళ (జులై 18వ తేదీ) శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్లు కర్ణాటక న్యాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఏదైనా పరిశ్రమ లేదా సంస్థ మేనేజ్‌మెంట్



కేటగిరీలో 50 శాతం, నాన్‌మేనేజ్‌మెంట్ కేటగిరీలో 70 శాతం మందిని కేవలం స్థానికుల నుంచే నియమించుకోవాలని బిల్లులో పొందుపరిచారు.

## మీ పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్
## లాగౌట్ చేస్తారా..?: మోదీ



**ఢిల్లీ:** డిజిటల్ రంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రోజురోజుకు పెచ్చుమీరుతున్న డిజిటల్ దాడులు, సైబర్ మోసాలపై ఆయన తాజాగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఓ కీలక సూచన చేశారు. ప్రపంచంలో జీవిస్తోన్న మనం నిత్యం హ్యాకింగ్, సైబర్ మోసాలు, వైరస్ దాడుల గురించి వింటున్నామని.. అందుకే పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్ లాగౌట్ చేయాలని మోదీ చెప్పినట్లు ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. "రోజూ పని పూర్తయిన వెంటనే మీ సిస్టమ్స్ లాగౌట్ చేస్తారా..? నేను చేస్తాను. సైబర్ భద్రత విషయంలో ఇది చాలా ముఖ్యం" అని మోదీ హెచ్చరించినట్లు ఈ కథనం పేర్కొంది. రోజు చివర్లో అన్ని సిస్టమ్స్ లాగౌట్ అయ్యాయా..? లేదా..? చూసుకొనే పనిని ప్రతీ ఆఫీస్‌లో ఒక వ్యక్తికి అప్పగించాలని చెప్పారు. ఇంటికి వెళ్లేప్పుడు తన సిస్టమ్‌ను తానే లాగౌట్ చేసుకుంటానని తెలిపారు. వాటిని ఓపెన్ చేసి ఉంచటం వల్ల సైబర్ దాడుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులకు ఆయన చెప్పారు.

# మంచి, మర్యాద గురించి ఎవరికైనా అవసరమైతే నేను నేర్పిస్తా

## విజయసాయిరెడ్డి

**విశ్వంభర, గుంటూరు:** మీడియాలో, సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారం పట్ల వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి భగ్గుమంటున్నారు. ముఖ్యంగా, కొన్ని మీడియా సంస్థలపైనా, మంత్రి నారా లోకేశ్ పైనా ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తాజాగా లోకేశ్ ను ఉద్దేశించి విజయసాయి ట్వీట్ చేశారు. "నారా లోకేశ్... నేను మీడియా ప్రతినిధులను ఎప్పుడూ తిట్టలేదు. మీడియా ముసుగులో మీరు పెంచి పోషిస్తున్న కుల అరాచక శక్తుల గురించి మాత్రమే మాట్లాడాను. నా మాటలను తప్పుదారి పట్టించవద్దు. అర్థం కాకపోతే నా ప్రెస్ మీట్ మళ్లీ వినండి. మంచి, మర్యాద గురించి ఎవరికైనా అవసరమైతే నేను నేర్పిస్తాను. మీ భాష ఏమిటో మీకు తెలియాలంటే గత 20 నెలల మీ వీడియోలను మీరే చూసుకోండి. పెద్దల సభ సభ్యుడితో మాట్లాడే తీరు ఇదేనా?" అంటూ ధ్వజమెత్తారు. "నారా లోకేశ్... రాష్ట్రంలో విద్యారంగం దారి తప్పింది. పాలకులు మాట తప్పుతున్నారు. స్కాలర్షిప్ లు రాలేదు, హాస్టళ్లు లేవు. అక్రమ బదిలీలు జరుగుతున్నాయి. విద్యారంగంపై తగినంత సమయం కేటాయించలేకపోతున్నారు. ముందు దానిపై దృష్టి పెట్టండి. ఈ మధ్య 40 రోజులుగా జరుగుతున్న నేరాలు, ఘోరాలకు కూటమి ప్రభుత్వంలోని పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారు? వీటిపై కూడా ఒక శ్వేతపత్రం విడుదల చేయొచ్చు కదా! అధికారం ఇస్తే 24 గంటల్లో న్యాయం అన్నారు... సుగాలి ప్రీతి ఏమైంది? చిత్తూరు జిల్లా మైనర్ బాలిక హత్య కేసు ఏమైంది? మీరు రాష్ట్రంలో రావణకాష్ఠాన్ని నిరాటంకంగా కొనసాగిస్తూ... కుల వివక్షతో మా పార్టీ కార్యకర్తలను, వారి కుటుంబాలను గ్రామాల నుంచి వెళ్లగొట్టి హింసిస్తూ, దాన్నుంచి దృష్టి మళ్లించడానికి ఎందుకీ యాతన?" అంటూ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

**పార్లమెంటులో ప్రైవేటు మెంబర్ బిల్లు పెడతా!**

ఇటీవలి పరిణామాల నేపథ్యంలో పార్లమెంటులో ప్రైవేటు మెంబర్ బిల్లు పెడతానని విజయసాయిరెడ్డి తెలిపారు. ఏపీలో కుల మీడియా సంస్థల పెత్తనం కొనసాగుతోందని మండిపడ్డారు. కుట్రపూరితమైన అజెండాతో ఆ మీడియా సంస్థలు ఫేక్ న్యూస్ వ్యాప్తిచేస్తూ, బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతూ, అప్రదిష్ఠపాల్జేసే చర్యలకు పాల్పడుతున్నాయని... వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఇతర పాత్రికేయ సంఘాలను ఆదేశించేలా బిల్లు పెడతానని వివరించారు. అధికారంతో పాటు బాధ్యత కూడా రావాలని, కానీ మీడియాలోని ఒక వర్గంలో ఆ రెండోది లోపించిందని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.





# విమానంలో అస్వస్థతకు గురైన ప్రయాణికుడు

### సకాలంలో వైద్యసేవలు అందేలాజేసిన నారా భువనేశ్వరి

**విశ్వంభర, తిరుపతి:** ఇవాళ హైదరాబాద్ నుంచి తిరుపతి వస్తున్న విమానంలో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురికాగా, అదే విమానంలో ప్రయాణిస్తున్న సీఎం చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి చొరవతో ఆ ప్రయాణికుడికి సకాలంలో వైద్యసేవలు అందాయి. ఆ విమానంలో శశిధర్ అనే ప్రయాణికుడు శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. శశిధర్ ప్రయాణిస్తున్న విమానంలోనే నారా భువనేశ్వరి కూడా ఉన్నారు. ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురైన అంశాలన్ని ఆమె ఏపీ ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎంవో సిబ్బంది విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. దాంతో తిరుపతి ఎయిర్ పోర్టులో విమానం వద్దకే డాక్టర్లను, అంబులెన్స్ ను తీసుకొచ్చారు. డాక్టర్లు సకాలంలో చికిత్స అందించడంతో ప్రయాణికుడు శశిధర్ కోలుకున్నాడు.

# లోకేష్ చొరవతో కువైట్ నుంచి ఏపీకి చేరుకున్న శివ



**విశ్వంభర, మదనపల్లె :** ఏపీ నుంచి కువైట్ వెళ్లి, అక్కడ అష్టకష్టాలు పడుతూ, తనను ఎవరైనా ఆదుకోకపోతే చావే దిక్కు అంటూ శివ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టిన వీడియో వైరల్ కావడం తెలిసిందే. దీనిపై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేశ్ శివను కువైట్ నుంచి ఏపీకి రప్పించేందుకు ఎంతో కృషి చేశారు. భారత ఎంబసీతో సమన్వయం చేసుకుంటూ, అతడిని ఏపీకి తీసుకువచ్చేంతవరకు స్వయంగా పర్యవేక్షించారు. మంత్రి లోకేశ్ చొరవతో శివ కువైట్ నుంచి ఏపీకి తిరిగి వచ్చాడు. ఎయిర్ పోర్టులో శివను చూసి అతడి కుటుంబ సభ్యులు తీవ్ర భావోద్వేగాలతో కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, శివ తన స్వస్థలం మదనపల్లె చేరుకున్న విషయం తెలుసుకున్న నారా లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు.

# ముచ్చుమర్రి ఘటనపై ప్రభుత్వం సీరియస్.. ఇద్దరు పోలీసు అధికారులపై వేటు




**విశ్వంభర, నందికొట్కూరు:** నంద్యాల జిల్లా ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యం ఘటనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. విధుల పట్ల నిర్లక్ష్యం, క్రమశిక్షణ ఉల్లంఘించిన ఇద్దరు పోలీసు అధికారులను కర్నూల్ రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు సస్పెండ్ చేశారు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయ భాస్కర్, ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ ఎస్సై ఆర్. జయశేఖర్ లపై వేటు వేస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కర్నూలు రేంజ్ డిఐజి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ముచ్చుమర్రి ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాలిక మృతదేహం కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. జూలై 7న ఆడుకోవడానికి వెళ్లిన బాలికను ముగ్గురు మైనర్ బాలురు లైంగిక దాడి చేసి చంపేశారని, మృతదేహాన్ని కేసీ కెనాల్ లో పడేసినట్టు నంద్యాల ఎస్పీ అదిరాజ్ తెలిపారు. తమ పిల్లలు దొరికిపోతారనే భయంతో నిందితులు కుటుంబీకులు బాలిక మృతదేహానికి రాళ్లు కట్టి పుట్టిలో తీసుకెళ్లి కృష్ణా నదిలో పడేశారని వెల్లడించారు.

# ఏపీలో మూడు విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం: పురందేశ్వరి

**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీలో మూడు కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర చీఫ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. దగదర్తి (నెల్లూరు జిల్లా), కుప్పం (చిత్తూరు జిల్లా), మూలపేట (శ్రీకాకుళం జిల్లా)లో నూతన విమానాశ్రయాలు ఏర్పాటవుతాయని చెప్పారు. కేంద్రంలోనూ ఎన్డీయే, రాష్ట్రంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలో ఉండడం వల్ల ఇది సాధ్యమవుతోందని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఏపీలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అయ్యాయని పురందేశ్వరి పేర్కొన్నారు. అభివృద్ధి ద్వారా అనుసంధానత పెరగడమే కాదు, ఆర్థిక పురోగతి కూడా సాధ్యమవుతుందని వివరించారు.



# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు లేఖ రాసి నరసాపురం ఎంపీడీవో అదృశ్యం

**విశ్వంభర, నరసాపురం:** పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు అదృశ్యం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఆయన ఏలూరు కాలువలో దూకి ఉంటాడని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. జులై 10 నుంచి సెలవులో ఉన్న వెంకటరమణారావు మచిలీపట్నం వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయల్దేరారు. ఈ నెల 16న ఆయన పుట్టినరోజు కాగా... పుట్టినరోజే తన చివరి రోజు అంటూ ఎంపీడీవో తన కుటుంబ సభ్యులకు మెసేజ్ పెట్టడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎంపీడీవో అదృశ్యం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు. మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారు



లక్షల్లో బకాయి ఉన్నందునే, ఒత్తిడి భరించలేక వెంకటరమణారావు అదృశ్యమైనట్టు తెలుస్తోంది. కాగా, ఎంపీడీవో వెంకటరమణారావు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు లేఖ రాశారు. కొందరు వ్యక్తులు రూ.55 లక్షల మేర ఫెర్రీ లీజు బకాయి పడ్డారని వెంకటరమణారావు ఆ లేఖలో పేర్కొన్నారు. గత చీఫ్ విప్ ప్రసాద రాజు అండతో వారు డబ్బులు చెల్లించలేదని ఆరోపించారు. గత మూడున్నర నెలలుగా వారు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చేయని తప్పుకు మానసిక క్షోభ అనుభవిస్తున్నానని తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బకాయిలు రికవరీ చేయనందున ప్రభుత్వం తనను బాధ్యుడ్ని చేసే అవకాశం ఉందంటూ వాపోయారు. ఎంపీడీవో ఉద్యోగమే తనకు జీవనాధారం అని, సదరు వ్యక్తులు బకాయిలు చెల్లించేలా చేసి తనకు న్యాయం చేయాలని వెంకటరమణారావు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు విజ్ఞప్తి చేశారు.

# అయిననూ పోయి రావలె హస్తినకు అన్నట్టుంది సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన!: షర్మిల

**విశ్వంభర, కడప:** ఏపీ సీఎం చంద్రబాబు తాజాగా మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. సీఎం చంద్రబాబు గారి ఢిల్లీ పర్యటనలు చూస్తుంటే 'అయిననూ పోయి రావలె హస్తినకు..' అన్నట్టుంది అని ఎద్దేవా చేశారు. ఎన్డీయే కూటమిలో పెద్దన్న పాత్రలో ఢిల్లీలో చక్రం తిప్పాల్సిన మీరు... ఢిల్లీ చుట్టూ ఎందుకు చక్కర్లు కొడుతున్నట్టు? ముక్కుపిండి విభజన సమస్యలపై పట్టుబట్టాల్సింది పోయి బీజేపీ పెద్దలకు జీ హుజూర్ అంటూ సలాంలు ఎందుకు కొడుతున్నట్టు? అని చంద్రబాబును ప్రశ్నించారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడి నెల రోజులు దాటినా... మోదీతో గానీ, ఇతర మంత్రులతో గానీ ఒక్క హామీ మీద ఎందుకు ప్రకటన చేయించలేకపోయారు? గెలిచిన రోజు నుంచి నాలుగు సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా రాష్ట్ర ప్రయోజనాలపై ఒక్క ప్రకటన అయినా వచ్చిందా? విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉండదు అని కేంద్ర పెద్దలతో చెప్పించగలిగారా? పోలవరం ప్రాజెక్టుకు నిధులపై స్పష్టత ఇచ్చారా? రాజధాని నిర్మాణంపై కేంద్రం ఇచ్చే సాయం ఏంటో చెప్పగలిగారా? అంటూ నిలదీశారు. ఒడ్డు దాటేదాకా ఓడ మల్లన్న... దాటాక బోడి మల్లన్న... ఇదే బీజేపీ సిద్ధాంతం అని షర్మిల పేర్కొన్నారు. బాబు గారు ఇప్పటికైనా కళ్లు తెరవడం మంచిది అంటూ ట్వీట్ చేశారు. మరోసారి రాష్ట్ర ప్రజల మనోభావాలతో బీజేపీ ఆటలు ఆడుకుంటోంది అని గుర్తిస్తే మంచిదని స్పష్టం చేశారు.



# రాజకీయాల్లో విమర్శలు అవసరమే

## ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

**విశ్వంభర, మంగళగిరి:** వైసీపీ అరాచక పాలన కారణంగా ఆంధ్ర ప్రదేశ్ అన్ని రకాలుగా వెనుకబడిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తాము సంపద సృష్టిస్తున్నామని..అందుకే అమరావతి చుట్టూ రహదారుల నిర్మాణం వేగంగా చేపట్టామని అన్నారు. సంపద సృష్టికి కొంత సమయం పడుతుందన్నారు. జీతాలు ఇవ్వాలి కాబట్టే కొంత అప్పులు తీసుకోవాల్సి వస్తుందని ఆయన చెప్పారు. ప్రజాతీర్పుపై ఆత్మవిమర్శ చేసుకోకుండా వ్యవహరిస్తున్నారు అని విమర్శించారు. స్టాండర్డ్ ప్రొటోకాల్ ప్రకారం సీజనల్ వ్యాధుల గురించి ఏప్రిల్ నెల నుంచే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.మేం అధికారంలోకి వచ్చింది జూన్ నెలలో. వారు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక ఉదాసీనత లేకుండా పనిచేస్తున్నాం అని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ జింక్ ట్యాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నాం అని సత్య కుమార్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సంక్షేమం అసాధ్యం. అయినా సరే సంక్షేమం, అభివృద్ధి - రెండూ చేస్తున్నాం. నాలుగు సంవత్సరాలుగా సుగాలి ప్రీతి కేసులో ఏమీ చేయకుండా, ఇప్పుడొచ్చి మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు అని మండిపడ్డారు.రాజకీయాల్లో విమర్శలు అవసరమే. నిర్మాణాత్మకంగా అవి ఉండాలి. గతంలో విమర్శలు చేస్తే ఎలా కేసులు పెట్టారు? ఎలా వేధించారు? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.మీ పనుల కారణంగా ప్రజలు ఇలాంటి తీర్పునిచ్చారు అని అన్నారు. సుగాలి ప్రీతి కేసుకు సమాధానం చెబుతాం. అలాగే గొడ్డలి పోటుకు కూడా సమాధానం చెబుతాం" అని మంత్రి సత్యకుమార్ అన్నారు.



**వైసీపీ అరాచక పాలన కారణంగా ఏపీ అన్ని రకాలుగా వెనుకబడింది**

ఇవాళ జేపీ నడ్డాను ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కలిశారు. ఏపీలో రాజకీయ అంశాలు, స్థానిక ఎన్నికలపై జేపీ నడ్డాతో చర్చించాం. త్వరలో జాతీయస్థాయిలో అధ్యక్ష మార్పులుంటాయి. ఏపీలో కూడా మార్పులు ఉంటాయో లేదో నేను చెప్పలేను అని ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులను వివరించి, ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించాను.అలాగే గత ఐదేళ్లుగా రాష్ట్రంలో ఆరోగ్య విభాగాన్ని భ్రష్టుపట్టించిన విధానాన్ని కూడా వివరించాను అని తెలిపారు. 11 టీచింగ్ మెడికల్ కాలేజీలు ఉంటే, 6 కాలేజీల్లో మాత్రమే క్యాత్ లాబ్స్ ఉన్నాయి. మిగతా 5 కాలేజీలకు క్యాథ్ లాబ్స్ మంజూరు చేయాలని కోరాను. క్యాన్సర్ కి సంబంధించి మరి కొన్ని కేంద్రాలు మంజూరు చేయాలని కోరాను. NHM నుంచి నిధులు మంజూరు చేసే ప్రొవిజన్ లేదన్నారు. అయితే రూ. 300 కోట్లు మంజూరు చేయాలని కోరాను. సానుకూలంగా స్పందించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను పాత జిల్లాల లెక్కన మంజూరు చేశారు.కొత్తగా జిల్లాలు ఏర్పడ్డ నేపథ్యంలో ఆ ప్రకారం మంజూరు చేయాలని కోరాను. గ్రామీణ ఆరోగ్య మందిర్ల నిర్మాణానికి సహకారం అందించాలని కోరాను.ఆరోగ్య మందిర్లలో సిబ్బందికి జీతాలు చెల్లించడం కోసం రూ. 1,000 కోట్లు అందించాలని కోరాను.సస్టెయినబుల్ డెవలప్మెంట్ గోల్స్ సాధించాలంటే ఇవన్నీ అమలు చేయాలని చెప్పాను.వైసీపీ అరాచక పాలన కారణంగా ఏపీ అన్ని రకాలుగా వెనుకబడిందని వివరించాను అని మంత్రి తెలిపారు.

# సవాల్ కు కట్టుబడి ముద్రగడ పేరు మార్చుకున్నారు : అంబటి రాంబాబు



**విశ్వంభర, విజయనగరం :** కిర్లంపూడిలో ముద్రగడను మాజీ మంత్రి అంబటి కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు ఆసక్తిర వ్యాఖ్యలు చేశారు. ముద్రగడ పేరు మార్చుకున్నారని తెలిసి అభినందించడానికి కిర్లంపూడి వచ్చాను అని అన్నారు. సవాల్ కు కట్టుబడి ముద్రగడ పేరు మార్చుకున్నారు.చాలామంది సవాళ్లు చేస్తారు.. నాకు తెలిసి ఎవరు కట్టుబడి ఉండలేదు.పేరు మారినా ముద్రగడ ముద్రగడే అని అన్నారు.రాజకీయాల్లో నష్టపోయిన ముద్రగడ.. తన కులాన్ని ఏనాడు ఉపయోగించుకోలేదని ఆయన అన్నారు. కాపునాడు సమావేశం సమయంలో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి ఆ సమావేశానికి ముద్రగడ వచ్చారని అన్నారు. ఆ సమయంలో వంగవీటి జైలులో ఉన్నారని, కేవలం ఒక సవాల్ను స్వీకరించి ముద్రగడ తన పేరును మార్చుకున్నారని అన్నారు.

# విశాఖలో రెచ్చిపోయిన మరో ప్రేమోన్మాది..

**విశ్వంభర, విశాఖపట్నం:** విశాఖలో మరో ప్రేమోన్మాది..రెచ్చిపోయాడు. అనకాపల్లి రాంబిల్లి తరహాలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. పొక్సో కేసులో జైలుకి వెళ్లి బెయిల్ మీద వచ్చి హత్యాయత్నం చేశాడు. తృటిలో హత్య తప్పింది. విశాఖలోని న్యూపోర్ట్ పరిధిలో ఈ ఘాతుకం చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిన్న రాత్రి వుడా కాలనీ సమీపంలో శ్యామల అనే యువతిపై కత్తితో హత్యయత్నం చేయడానికి ప్రయత్నించాడు సిద్ధు అనే యువకుడు. అడ్డు వచ్చిన యువతి శ్యామల తల్లి సావిత్రిపై కత్తితో దాడి చేయడంతో యువతి తల్లి సింగపల్లి సావిత్రి చేతికి గాయం అయింది. ఏప్రిల్ నెలలో యువతి కాలేజ్ వద్ద నిందితుడు సిద్ధు అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోక్స్ కేసు నమోదు చేసిన రిమాండ్ కి తరలించారు గాజువాక పోలీసులు. నిందితుడు పరారీలో ఉండటంతో,గాలింపు చేస్తున్నారు న్యూపోర్ట్ పోలీసులు. ఈ సంఘటనపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏపీలో త్వరలోనే నూతన మద్యం పాలసీ : మంత్రి కొల్లు రవీంద్ర



**విశ్వంభర, తిరుపతి:** ఏపీలో త్వరలోనే నూతన మద్యం పాలసీ ప్రకటిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటన చేశారు. బుధవారం తిరుమలకు మంత్రి కొల్లు రవీంద్ర వచ్చారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారినికి దర్శించుకుని మాట్లాడారు మంత్రి కొల్లు రవీంద్ర. త్వరలోనే నూతన మద్యం పాలసిని ప్రకటిస్తామని చెప్పారు మంత్రి కొల్లు రవీంద్ర. గత పాలకులు అన్ని వ్యవస్థలను నాశనం చేసారు..ఆంధ్ర ప్రదేశ్ రాష్ట ఆర్దిక పరిస్థిని పూర్తిగా అప్పులు పాలు చేశారని నిప్పులు చెరిగారు మంత్రి కొల్లు రవీంద్ర. మా మీద నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఐదు సంవత్సరాలు స్వచ్చమైన పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. గత పాలకులుకు కోంత మంది అధికార్లు వత్తాసు పలికి అవినీతిలో తమ వంతు పాత్ర పోషించారని వివరించారు మంత్రి కొల్లు రవీంద్ర. ఏపీ ప్రజలకు న్యాయం చేసేలా పని చే స్తామని స్పష్టం చేశారు.

# అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంపై జగన్ సంచలన నిర్ణయం..!

**విశ్వంభర, తాడేపల్లిగూడెం :** అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంపై ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ సంచలన నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఈనెల 22 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలకు వైసీపీ అధినేత జగన్ హాజరుకానున్నట్లు ఆ పార్టీ నేతలు వెల్లడించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఘటనలను లేవనెత్తాలని జగన్ భావిస్తున్నారని సమాచారం. ప్రతిపక్ష హోదా లేకపోవడంతో సాధారణ ఎమ్మెల్యేగా జగన్ చర్చల్లో పాల్గొంటారు. మరి ఆయనకు అధికార పార్టీ తగిన సమయం ఇస్తుందా? లేదా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కాగా, ఈ నెల 22 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏపీ కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 22 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న తరునంలో ఓటాన్ అకౌంట్ పెట్టాలా.. లేక ఆర్డినెన్స్ పెట్టాలా అనే అంశంపై చర్చ నిర్వహించారు చంద్రబాబు.





### కొడుకు అగస్త్యతో కలిసి సెర్బియాకు

# హార్దిక్ భార్య నటాషా

విశ్వంభర, స్పోర్ట్స్ : భారత్ జట్టు ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య, ఆయన సతీమణి నటాషా స్టాంకోవిచ్ మధ్య విడాకుల వ్యవహారంపై గతకొద్దికాలంగా చర్చ జరుగుతుంది. వారు విడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో త్వరలో వారు విడాకులు తీసుకోబోతున్నారని తెలుస్తోంది. అయితే, ఈ విషయంపై హార్దిక్, నటాషా ఎవరూ క్లారిటీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో కొడుకు అగస్త్యను తీసుకొని నటాషా స్టాంకోవిచ్ సెర్బియాకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బుధవారం తెల్లవారుజామున కుమారుడుతో కలిసి నటాషా ముంబయి విమానాశ్రయం నుంచి సెర్బియాకు వెళ్లినట్లు తెలుస్తోంది. వారు ముంబయి విమానాశ్రయం నుంచి బయలుదేరిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిల్లో హార్దిక్ పాండ్యా ఎక్కడా కనిపించలేదు. దీనికితోడు నటాషా తన ప్రయాణానికి సంబంధించిన చిత్రాలను ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పంచుకుంది. లాగేజీతో కూడిన ఫొటోకు ఈ సంవత్సరంలో ఆ సమయం వచ్చింది అంటూ కన్నీళ్లతో కూడిన ఎమోజీ, విమానం, ఇల్లు, హార్ట్ సింబల్ ఎమోజీని షేర్ చేసింది.మరోవైపు త్వరలో శ్రీలంకతో జరగనున్న వన్డే సిరీస్ కు తాను అందుబాటులో ఉండనని హార్దిక్ పాండ్యా బీసీసీఐ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత కారణాల వల్ల తాను అందుబాటులో ఉండలేక పోతున్నానని పేర్కొన్నట్లు సమాచారం. భార్య నటాషాతో విడాకులు తీసుకోవడం కోసమే హార్దిక్ శ్రీలంకతో వన్డే సిరీస్ కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

### ఐదుగురి ప్లేయర్లకు కావ్య మారన్ పింక్ స్లిప్..

# మెగా వేలంలో వారిపైనే గురి



**విశ్వంభర, స్పోర్ట్స్** : ఐపీఎల్ 2025కి రంగం సిద్ధం చేస్తోంది బీసీసీఐ. ఈ సీజన్‌కు ముందుగా మెగా వేలం జరగనుండటంతో ఫ్రాంచైజీల రిటైన్ లిస్టులో బోర్డు మరికొద్ది రోజుల్లో తుది నిర్ణయం ప్రకటించింది. అయితే ఐపీఎల్ 2022 మెగా వేలం మాదిరిగానే 3 + 1(RTM)కే బీసీసీఐ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదన కన్ఫర్మ్ అయితే.. ఫ్రాంచైజీలు అన్నీ కూడా మరో ఐదు సీజన్లకు సరిపడా బలమైన జట్లను రూపొందించాల్సిన పని పడుతుంది. అలాగే రిటైన్ చేసుకునే లిస్టులో కూడా పలు కీలక మార్పులు చేసుకోవాల్సి వస్తుంది. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ జట్టులో రిటైన్ చేసుకునే లిస్టును ఇప్పటికే సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మతో పాటు షాబాజ్ అహ్మద్‌లను రిటైన్ చేసుకుంటుందట.ఇక రైట్ టూ మ్యాచ్ కార్డు కింద హైదరాబాదీ ఆల్‌రౌండర్ నితీష్ రెడ్డిని తీసుకోనుందట సన్‌రైజర్స్ హైదరాబాద్. ఇదే జరిగితే దాదాపు ఆ ఫ్రాంచైజీ స్టార్ ప్లేయర్స్ అందరూ మెగా వేలంలోకి రానున్నారు. ఇక్కడ ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ దిగులుపడాల్సిన పన్లేదు. ప్యాట్ కమిన్స్, క్లాసన్, మార్‌క్రమ్, ఫిలిప్స్, జాన్సన్, వాషింగ్టన్ సుందర్, నటరాజన్, హసరంగా, భువనేశ్వర్ కుమార్ లాంటి ఆటగాళ్లను మళ్లీ వేలంలో తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.అటు కెఎల్ రాహుల్, రోహిత్ శర్మలాంటి దిగ్గజ ఆటగాళ్లు మెగా వేలంలో వస్తారని రూమర్స్ వినిపించడంతో.. కావ్య మారన్ వారిపై ఎక్కువ డబ్బులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని టాక్.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**విశ్వంభర, నారాయణపూర్** : కాంగ్రెస్ పార్టీ నీరుపేదలకు అండగా ఉంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం పి.నందిని జ్యోతి బాబుకి 36000, అలాగే శంకరమ్మ భర్త శంకరయ్యకు 15 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం మనందరి ప్రభుత్వం ప్రతి ఒక్క నిరుపేదకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజం సత్యనారాయణ, పిట్ట కృష్ణ, గంజి కృష్ణయ్య, దేప ప్రవీణ్ రెడ్డి, పెంబల్ల కృష్ణ, జెల్లా మార్కొండయ్య, దేప ప్రతాపరెడ్డి, గంజి వెంకటేశం, కానుగుల యాదయ్య, జోకు స్వామి, డాక్టర్ గంజి వెంకటేశ్వర్లు, గోలి సాంబయ్య, కోడి యాదగిరి, బాతరాజు లక్ష్మణ్, కుక్కల గోపాల్, కర్నాటి ఉమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.





### హార్దిక్ కాదు.. గిల్, పంత్‌లకు నో ఛాన్స్..

# టీమిండియా టీ20 కెప్టెన్ అతనే..

**విశ్వంభర, స్పోర్ట్స్ :**

రోహిత్ శర్మ తర్వాత భారత టీ20 జట్టు తదుపరి కెప్టెన్ ఎవరు? ప్రస్తుతం క్రికెట్ అభిమానుల్లో దీనిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. నిన్నటి వరకు రోహిత్ వారసుడిగా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా పేరు బాగా వినిపించింది. అలాగే శుభ్ మన్ గిల్, రిషభ్ పంత్ లు కూడా కెప్టెన్ రేసులో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ లిస్టులో ఇప్పుడు మరొక పేరు వినిపిస్తోంది. అదే టీమిండియా 360 డిగ్రీ ప్లేయర్ సూర్య కుమార్ యాదవ్. దీనికి తగ్గట్టుగానే శ్రీలంకతో జరిగే టీ20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా ఉండాలని టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ కోరినట్లు గతంలో వార్తలు వచ్చాయి. టీ20 కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా స్థానంలో సూర్యకుమార్ యాదవ్ ఉత్తమ ఎంపికని గౌతీ భావిస్తున్నాడు. ఈ మేరకు టీ20 జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేయాల్సిందిగా సెలక్షన్ కమిటీకి గంభీర్ సూచించినట్లు సమాచారం. దీనికి ప్రధాన కారణం హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలు.

**హార్దిక్ ఫిట్ నెస్ సమస్యలే ప్రధాన కారణం..**

హార్దిక్ పాండ్యా తరచూ గాయలపాలవుతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ దీనికి నిదర్శనం. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా పాండ్యా వన్డే ప్రపంచకప్ మధ్యలోనే ఆడాడు. దీని తర్వాత అతను నేరుగా టీ20 ప్రపంచకప్‌లో ఆడడం గమనార్హం. అందుకే, పూర్తి ఫిట్‌నెస్‌తో జట్టులో శాశ్వత సభ్యుడిగా ఉన్న ఆటగాడికి కెప్టెన్సీ ఇవ్వాలని గౌతమ్ గంభీర్ సెలక్షన్ కమిటీని అభ్యర్థించాడు. ఈ అభ్యర్థన మేరకు ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ పేరు తెరపైకి రావడంతో అతడికి కెప్టెన్ గా పట్టం కట్టే అవకాశాలున్నట్లు వార్తలు వస్తున్నాయి. సూర్యకుమార్ యాదవ్ ఇప్పటికే భారత టీ20 జట్టుకు కెప్టెన్‌గా కనిపించాడు. కీలక ఆటగాళ్ల గైర్హాజరీ మధ్య సూర్య 7 టీ20 మ్యాచ్‌లకు భారత జట్టుకు నాయకత్వం వహించాడు. సూర్య సారథ్యంలో భారత్ 5 మ్యాచ్‌ల్లో టీమిండియా విజయం సాధించింది. గౌతీ డిమాండ్ నేపథ్యంలో త్వరలోనే టీమిండియా 20 కెప్టెన్ గా సూర్యకుమార్ యాదవ్‌ను ప్రకటించినా పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు.





### టీ20 ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్,

# వాషింగ్టన్ సుందర్ దూకుడు

**విశ్వంభర, స్పోర్ట్స్** :ఇటీవల జింబాబ్వే పర్యటనలో అదరగొట్టిన భారత యువ ఆటగాళ్లు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లోనూ దుమ్మురేపారు. జింబాబ్వే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన శుభ్‌మన్ గిల్‌తో పాటు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌లు తమ స్థానాలను మెరుగుపరచుకున్నారు. ఆఖరి మూడు టీ20 మ్యాచులే ఆడిన యశస్వి 165.88 స్ట్రైక్‌రేటుతో 141 పరుగులు చేశాడు. దీంతో నాలుగు స్థానాలు మెరుగుపరచుకుని ఆరో ర్యాంకుకు చేరుకున్నాడు.125 స్ట్రైక్‌రేటుతో 170 పరుగులు చేసిన గిల్ ఏకంగా 36 స్థానాలు ఎగబాకి 37వ స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో పొట్టి ఫార్మాట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ (42 ర్యాంక్), విరాట్ కోహ్లి (51) లను గిల్ అధిగమించాడు. రుతురాజ్ గైక్వాడ్ ఓ స్థానాన్ని కోల్పోయి ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియా విధ్వంసకర వీరుడు ట్రావిస్ హెడ్ 844 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లాండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్‌తో కలిసి రెండో స్థానంలో ఉన్నాడు. వీరిద్దరి ఖాతాలో 797 పాయింట్లు ఉన్నాయి.

**బౌలింగ్ ర్యాంకింగ్స్..**

జింబాబ్వే పర్యటనలో 6 వికెట్లతో రాణించిన వాషింగ్టన్ సుందర్ 36 స్థానాలు ఎగబాకి 46 స్థానానికి చేరుకున్నాడు. పేసర్ ముకేశ్ కుమార్ 21 స్థానాలు మెరుగుపరచుకుని 73వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. అక్షర్ పటేల్ నాలుగు స్థానాలు కోల్పోయి 13 ర్యాంక్‌కు పడిపోయాడు. కాగా.. ఇంగ్లాండ్ స్టార్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్ విషయానికి వస్తే.. హార్దిక్ పాండ్య ఆరో ర్యాంక్‌కు పడిపోయాడు. శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ అగ్రస్థానంలో ఉన్నాడు.

# టీమ్‌ఇండియా అభిమానులకు శుభవార్త..



**విశ్వంభర, స్పోర్ట్స్** : టీమ్‌ఇండియా వెటరన్ పేసర్ మహ్మద్ షమీ త్వరలోనే రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్ 2023 అనంతరం షమీ ఆటకు దూరంగా ఉన్నాడు. చీలమండల గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో షమీ కోలుకుంటున్నాడు. ఈ క్రమంలోనే తన ఫిట్‌నెస్ పై దృష్టి పెట్టాడు. నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్‌ను మొదలుపెట్టాడు. అయితే.. పూర్తి స్థాయి తీవ్రతతో బౌలింగ్ చేసేందుకు మరికొన్ని రోజులు పట్టనుంది. కాగా.. తాను బౌలింగ్ చేస్తున్న వీడియోను షమీ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నాడు. షమీ పూర్తిగా కోలుకుంటే సెప్టెంబరులో బంగ్లాదేశ్‌తో జరగనున్న రెండు టెస్టు మ్యాచుల సిరీస్‌తో రీ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. ఈ సిరీస్ తరువాత న్యూజిలాండ్‌తో భారత్ మూడు టెస్టులు ఆడనుంది. ఆ తరువాత బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ కోసం నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది భారత్. ఆసీస్‌తో ఐదు టెస్టులు ఆడనుంది.స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్ 2023లో మహ్మద్ షమీ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. కాగా.. ప్రపంచకప్ ఆడుతున్న సమయంలోనే షమీ చీలమండలానికి గాయమైంది. ఓ వైపు గాయం వేధిస్తున్నప్పటికీ కూడా టీమ్‌ఇండియాను గెలిపించేందుకు షమీ కొన్ని మ్యాచుల్లో ఆడాడు. ఆస్ట్రేలియాతో ఫైనల్ ముగిసిన తరువాత లండన్‌కు వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దీంతో దక్షిణాఫ్రికా పర్యటన, ఐపీఎల్ 2024, టీ20 ప్రపంచకప్ 2024టోర్నీలకు దూరం అయ్యాడు.

### ఆ మహీంద్రా కారుపై ఏకంగా

# రూ.2.2 లక్షల వరకూ తగ్గింపు

**విశ్వంభర, బిజినెస్** : భారతదేశంలో మహీంద్రా కార్లకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంది. అందువల్ల మహీంద్రా కార్లు అమ్మకాల్లో ఎప్పకప్పుడు రికార్డులను సెట్ చేస్తూ ఉంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కొన్ని మోడల్స్ కార్లపై ఇటీవల మహీంద్రా కంపెనీ ఆఫర్లను ఇస్తుంది. మహీంద్రా ఎక్స్‌యూవీ 700 కారు రిలీజ్ చేసి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా మహీంద్రా & మహీంద్రా ఆ కారుపై రూ. 2.2 లక్షల వరకు భారీ తగ్గింపులను ప్రకటించింది. అయితే ఈ తగ్గింపు పరిమిత కాలానికి మాత్రమే అందుబాటులో ఉంటుంది. రేంజ్ టాపింగ్ ఏఎక్స్ 7 వేరియంట్లకు మాత్రమే ఈ తగ్గింపు వర్తిస్తుంది. మహీంద్రా ఏఎక్స్7 శ్రేణి రూ. 21.44 లక్షల ఎక్స్ షోరూమ్ ధరతో ప్రారంభమైంది. ఇప్పుడు తగ్గింపుతో ఈ కారు ధర రూ. 19.69 లక్షలకు లభిస్తుంది. టాప్ స్పెక్స్‌తో వచ్చే ఏఎక్స్7 లగ్జరీ ఏడబ్ల్యూడీ వేరియంట్ తగ్గింపు ధరతో రూ. 24.99 లక్షలు లభిస్తుంది. ఈ నేపథ్యంలో మహీంద్రా ఎక్స్‌యూవీ 700 గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.తాజాగా తగ్గింపులతో బెంగళూరులో మహీంద్రా ఎక్స్‌యూవీ 700 టాప్‌ఆఫ్‌దిలైన్ ఏఎక్స్7 ఏడబ్ల్యూడీ డీజిల్ వేరియంట్ ఆన్‌రోడ్ ధర రూ. 31.5 లక్షలుగా ఉంటే ఢిల్లీలో మైక్రో ఎస్‌యూవీ ధర 29.62గా ఉంది. ముంబైలో రూ.30.2 లక్షలు, చెన్నైలో రూ.31.5 లక్షలు, హైదరాబాద్‌లో ఈ ఎస్‌యూవీ తగ్గింపుల అనంతరం రూ.31 లక్షలకు అందుబాటులో ఉంది. అలాగే కోల్‌కత్తాలో రూ.27.87 లక్షలు, లక్నోలో 28.97 లక్షలు, జైపూర్లో రూ.29.92 లక్షలు, అహ్మదాబాద్‌లో రూ.28 లక్షలు, ఇండోర్‌లో రూ.30.87 లక్షలుగా ఉంది. ఇక ఫీచర్ల విషయానికొస్తే టాప్‌ఆఫ్‌లైన్ ఏఎక్స్7 మోడల్ లెవెల్ 1 ఏడీఏఎస్, ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్, ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ కోసం ట్విన్ డిజిటల్ స్క్రీన్లు, పనోరమిక్ సన్రూఫ్, 360 డిగ్రీ కెమెరా, డ్యూయల్‌జోన్ క్లైమేట్ కంట్రోల్, ఎలక్ట్రికల్‌గా సర్దుబాటు చేసేలా డ్రైవర్ సీటు వంటి ఫీచర్లు యువతను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వెంటిలేటెడ్ సీట్లు, ఏడు ఎయిర్‌బ్యాగ్లు, లెథెరెట్ సీట్ అప్హోల్బరీ, 12 స్పీకర్లతో 3డీ సౌండ్ సిస్టమ్ వంటివి ఈ కారు ప్రత్యేకతలుగా ఉన్నాయి. మహీంద్రా ఎక్స్‌యూవీ 700 రెండు ఇంజిన్ ఎంపికలతో వస్తుంది. 2.0లీటర్, 4సిలిండర్, టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజన్ 200 హెచ్‌పీ శక్తిని, 380ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తుంది. గేర్బాక్స్ ఎంపికల విషయానికి వస్తే 6 స్పీడ్ మాన్యువల్, 6స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమేటిక్ ఫీచర్లు ఆకట్టుకుంటాయి. మరో ఇంజిన్ విషయానికి వస్తే 2.2లీటర్, 4సిలిండర్, టర్బోచార్జ్డ్ డీజిల్ ఇంజన్. ఇది రెండు స్టేట్స్ ఆఫ్ ట్యూన్‌తో వస్తుంది. పెట్రోల్ మాదిరిగానే, డీజిల్ ఇంజన్ కూడా 6 స్పీడ్ మాన్యువల్, 6స్పీడ్ టార్క్ కన్వర్టర్‌తో వస్తుంది.





# రాత్రి పెగ్గేసి, నిద్రమాత్రలు తీసుకోనిదే నిద్ర రాదంటున్న హీరోయిన్..

సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అంటూ చాలా మంది హీరోయిన్స్ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇండస్ట్రీలో స్టార్స్, దర్శకనిర్మాతల వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామంటూ సంచలన కామెంట్స్ చేసిన వారు పాయల్ ఘోష్ ఒకరు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన ఊసరవెల్లి సినిమాలో తమన్నా స్నేహితురాలిగా కనిపించింది. ఆ తర్వాత మరికొన్ని చిత్రాల్లో నటించిన పాయల్.. హిందీలోనూ పలు సినిమాలు చేసింది. అయితే కొన్నాళ్ల తర్వాత సినిమాలకు దూరమైన పాయల్.. హిందీ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ తనను లైంగికంగా వేధించాడని ఆరోపణలు చేసింది. ఆ తర్వాత పలువురు క్రికెటర్స్ గురించి అనేక రకాల కామెంట్స్ చేసింది. కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్న పాయల్.. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా తన ఇన్ స్టాలో షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు తెగ వైరలవుతుంది. చాలా రోజులు తాను డిప్రెషన్ కారణంగా బాధపడినట్లు తెలిపింది. తనకు ఎదురైన వేధింపుల గురించి మరోసారి ప్రస్తావిస్తూ.. తాను నిదుర మాత్రలు తీసుకునేదాన్ని అని.. ఒక గ్లాస్ వైన్ తాగనిదే ఇప్పటికీ నిదుర పోలేనని వెల్లడించింది. అలాగే డైరెక్టర్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ తనను లైంగికంగా వేధించాడని.. తీవ్రమైన డిప్రెషన్ లోకి వెళ్లానని పేర్కొంది. కొన్నేళ్లుగా యాంటీ డిప్రసెంట్ మందులు వాడుతున్నాని.. వాటి వ్లల ట్రామాలోకి వెళ్లానని.. అలాగే అనురాగ్ కశ్యప్ కు కూడా కూతురు ఉందని.. ఆమె కూడా తనలాగే వేధింపులకు గురవుతుందని పాయల్ మరో పోస్ట్ చేసింది. ప్రస్తుతం పాయల్ ఘోష్ చేసిన ఇన్ స్టా పోస్ట్ నెట్టింట వైరలవుతుంది. పాయల్ ఘోష్ తెలుగులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన ఊసరవెల్లి సినిమాలో తమన్నా స్నేహితురాలిగా కనిపించింది. ఈ సినిమాతోనే ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. అలాగే మంచు మనోజ్ నటించిన ప్రయాణం సినిమాలోనూ నటించింది. గతంలోనూ పాయల్ చాలా సార్లు పలువురు క్రికెటర్స్ గురించి అనేక పోస్టులు చేసింది.

# పూజా హెగ్డేకి అర్జంటుగా ఓ హిట్ కావాలి.!

ఏ పని మీదయినా పూర్తి శ్రద్ధ పెట్టాలనుకున్నప్పుడు ముందు అదర్ యావగేషన్స్ కి ఫుల్‌స్టాప్ పెట్టాలి. చిన్నా చితకా పనులన్నిటినీ కంప్లీట్ చేసేసుకుంటే, పర్ఫెక్ట్ గా దృష్టి పెట్టడానికి వీలవుతుంది. ఇప్పుడు యాజ్ ఇట్ ఈజ్‌గా ఇలాగే అనుకుంటున్నారు పూజా హెగ్డే. అందుకే మిగిలిన పనుల ఫైల్స్ ని ఒక్కొక్కటిగా క్లోజ్ చేస్తున్నారు. పూజా హెగ్డే కి ఇప్పుడు అర్జంటుగా ఓ హిట్ కావాలి. ఆ విజయం ఏ ఇండస్ట్రీ ఇచ్చినా ఫర్వాలేదు. కానీ హిట్ మాత్రం మస్ట్. మరి ఆ హిట్‌ని ఇచ్చేదెవరు? సౌత్‌లో కెరీర్ మాంచి ఊపు మీదున్నప్పుడు నార్త్ కాలింగ్ అంటూ అటు వెళ్లిపోయారు. ఇక్కడి ప్రాజెక్టులకు ఫుల్‌స్టాప్ పెట్టి, పూర్తిగా అటే షిఫ్ట్ అవుదామని అనుకున్నారు. అయితే అమ్మణి అనుకున్నది ఒకటి అక్కడ జరిగింది మరొకటి. సౌత్‌లో తాను పోగొట్టుకున్న చరిష్మాను మళ్లీ తెచ్చుకోవాలనుకుంటున్నారు పూజా. అందులో భాగంగానే కొన్నాళ్ల పాటు ముంబైకి దూరంగా ఉండాలనుకుంటున్నారు. హిందీ సినిమాల కన్నా తెలుగు, తమిళ్ స్క్రిప్టులనే ఎక్కువగా వింటున్నారట ఈ బ్యూటీ. చేతిలో ఉన్న హిందీ ప్రాజెక్ట్ షూటింగ్ కూడా కంప్లీట్ చేసేశారు. పనిలో పనిగా రీసెంట్‌గా తనకు ఇష్టమైన బీచ్ ట్రిప్‌కి కూడా వెళ్లొచ్చేశారు. సో కొన్నాళ్ల పాటు ఆమె నార్త్ ట్రిప్స్ గానీ, జాలీ ట్రిప్స్ గానీ ఉండవు. తమిళ్‌లో సూర్య తో నటిస్తున్న సినిమా కంప్లీట్ చేయాలి. తెలుగులో యంగ్ హీరోలతో కమిట్ అయిన సినిమాలను పూర్తి చేయాలి. మిగిలిన ఇండస్ట్రీలతో పోలిస్తే 2025లో తెలుగు ఇండస్ట్రీ మీద ఎక్కువ దృష్టి సారించాలని అనుకుంటున్నారట ఈ బ్యూటీ. పక్కాగా ఫోకస్ చేస్తే, ఆమె చుట్టూ అవకాశాలు వాలడం మాత్రం గ్యారంటీ అంటున్నారు క్రిటిక్స్. మరి ఈసారైనా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, పూర్వ వైభవాన్ని చూస్తారా ఈ బ్యూటీ.. అని గుసగుసలాడు కుంటున్నారు జనాలు.



# నటుడు ఆర్.నారాయణమూర్తికి అస్వస్థత!



**విశ్వంభర, సినిమా :** నటుడు ఆర్. నారాయణమూర్తికి అస్వస్థత నెలకొంది. ప్రముఖ నటుడిగా , నిర్మాతగా, దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆర్ నారాయణ మూర్తి గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు.. సామాజిక అంశాలపై దృష్టి పెడుతూ సమాజంలో జరిగే అన్యాయాలను ప్రతిఖండిస్తూ సినిమాల రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అందుకే ఆర్ నారాయణ మూర్తి తెరకెక్కించే ప్రతి సినిమా కూడా ప్రేక్షకులకు అతి చేరువలో ఉంటుందని చెప్పడంలో సందేహం లేదు. అయితే ఎంతగా సినిమాలు తెరకెక్కించినప్పటికీ ఆస్తిపరంగా మాత్రం ఈయన దగ్గర చిల్లి గవ్వ కూడా లేదట. అయితే.. అలాంటి_ _ _ ఆర్ నారాయణ మూర్తికు తీవ్ర అస్వస్థత నెలకొంది. దీంతో నటుడు నారాయణమూర్తిని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆర్ నారాయణ మూర్తికు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందించారు.

**నేను ఆరోగ్యంగానే ఉన్న..ఆందోళన చెందొద్దు:ఆర్. నారాయణమూర్తి**

తన ఆరోగ్యం నిలకడగా ఉందని నటుడు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. ఆయన అస్వస్థతకు గురయ్యారనే వార్తలతో అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ నారాయణమూర్తి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నానని, దేవుడి దయతో కోలుకుంటున్నట్లు పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. కాగా, దర్శక నిర్మాత ఆర్ నారాయణ మూర్తికు తీవ్ర అస్వస్థత నెలకొంది. దీంతో నటుడు నారాయణమూర్తిని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.ఈ విషయం తెలిసి ఆయన అభిమానులు ఆందోళన చెందుతుండంతో.. పీపుల్ స్టార్ ఫాన్స్‌ను ఉద్దేశించి కీలక ప్రకటన చేశారు.

# నవీన్ పొలిశెట్టికి ప్రమాదం!



**విశ్వంభర, సినిమా:** టాలీవుడ్ యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి గురించి తెలియని వారుండరు. ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ, జాతి రత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాల గురించి మాట్లాడుకుంటే ప్రతి ఒక్కరికి యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి గుర్తుకు వస్తాడు. డిఫరెంట్ క్యారెక్టరైజేషన్స్ తో, తనదైన టైమింగ్ తో కథలకి ప్రాణం పోస్తూ_ _ _. సక్సెస్‌లు అందుకుంటున్న ఈ యువ హీరోకి టాలీవుడ్ లో విపరీతమైన క్రేజ్ ఉంది. టాలెంటెడ్ యాక్టర్ అనే గుర్తింపు కూడా సంపాదించుకున్నాడు. ఇక నవీన్ పోలిశెట్టికి దర్శకనిర్మాతలు పిలిచి మరి అవకాశాలు ఇస్తున్నారంటే ఇతనికి ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక నేచురల్ స్టార్ నాని తర్వాత తనదైన నేచురల్ పర్ఫామెన్స్ తో నవీన్ యూత్ ను విపరీతంగా ఆకట్టుకున్నాడు. తన అద్భుతమైన సినిమాలతో యూత్ కి కనెక్ట్ అయ్యాడు. అయితే.. ఈ మధ్య కాలంలో మీడియాలో బయట కనిపించలేదు. ఇటీవల నవీన్ చేయికి గాయం అయిందట. అందుకే నవీన్ ఎవరినీ కలువలేదని సమాచారం. దీనికి సంబంధించిన ఫోటో వైరల్ గా మారింది.




# సర్దార్ 2 సెట్‌లో ప్రమాదం.. ఒకరు మృతి

**విశ్వంభర, సినిమా:** చిత్ర పరిశ్రమలో విషాదాలు వరుసగా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే చాలా మంది మరణించారు. అయితే.. తాజాగా చిత్ర పరిశ్రమలో మరో విషాదం జరిగింది. సర్దార్ 2 సెట్ లో ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో స్టంట్ మ్యాన్ మృతి చెందారు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కార్తీ హీరోగా నటిస్తున్న సర్దార్ 2 సినిమా సెట్ లో ప్రమాదం జరిగింది. ఫైట్ సీన్స్ ప్రాక్టీస్ చేస్తున్న స్టంట్ మ్యాన్ ఎజుమలై ప్రమాదవశాత్తూ 20 అడుగుల ఎత్తు నుంచి కిందపడ్డాడు. చిత్రబృందం అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించింది. ఎజుమలైకి ఛాతీ భాగంలో తీవ్ర గాయమైంది ఊపిరితిత్తుల్లో రక్తస్రావం కావడంతో మృతిచెందాడు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కార్తీ హీరోగా 2022లో సర్దార్ చిత్రం తెరకెక్కింది.












Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com